నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 1-7-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 253 పేజీలు:6 వెల: రూ.1/-

కేసిఆర్ వరాల జల్లులు .. పంచాయితీ, మున్సిపాల్టీలకు భారీగా నిధులు

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 30 పోడు భూములకు పట్టాలు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్ అనంతరం జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తూ, ఉమ్మడి అదిలాబాద్ కు వరాలు కురిపించారు..కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలకు రూ. 25 కోట్లు సీఎం నిధి నుంచి మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆసిఫాబాద్‌లోని 335 గ్రామ పంచాయతీలకు రూ. 10లక్షల చొప్పున సాయం ప్రకటించారు. వార్ధా నదిపై వంతెన కావాలని, ఐటీఐ కావాలని ఇక్కడి ప్రజలు కోరారని.. వీటిని ఇప్పుడే మంజూరు చేస్తున్నామన్నారు. నాగమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేసీఆర్ తెలిపారు

వార్ధా నది నీళ్లు వ్యయసాయ అవసరాలకు వినియోగించేలా నీటి ప్రాజెక్ట్ లు కడుతున్నామని, త్వరలోనే గిరిజన వాసులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.. అలాగే గిరిజన ప్రాంతాలలో బోరు బావులపై వ్యవసాయం చేసే రైతులకు త్వరలోనే త్రీ పేజ్ కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చారు.. తెలంగాణలో అమలవుతున్న పథకాలు కావాలని పొరుగునే ఉన్న మహారాష్ట్ర వాళ్లు కోరుతున్నారని సీఎం కేసీఆర్ అన్నారు.

పట్టణాభివృద్ధి శాఖ సంచాలకులు డా.ఎన్.సత్యనారాయణ పదవి విరమణ

హైదరాబాద్, జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); :: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ సంచాలకులు డా.ఎన్.సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా ఆయనను మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ శుక్రవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ విభాగంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఆయన విశేష సేవలు అందించారని, కరోనా విపత్కర పరిస్థితులలో కూడా ఆయన నిర్విరామంగా కృషి చేశారని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. జి.హెచ్.యం.సి కమిషనర్ లోకేష్ కుమార్ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారిగా నియమితులైన సందర్భంగా ఆయనను కూడా సన్మానించారు.

కుమ్రంభీం విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

ఆసిఫాబాద్, జూన్ 30: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం కేసీఆర్ జిల్లా కేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో గోండు వీరుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అయిన కుమ్రంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం వెంట హోంమంత్రి మహమూద్ అలీ, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తదితరులు ఉన్నారు.

కాసేపట్లో చిల్డ్రన్ పార్క్‌లో కొట్నాక్ భీంరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించనున్నారు. తర్వాత జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించి ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అక్కడే జిల్లాలోని లబ్ధిదారులకు పోడు పట్టాలు అందజేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనం చేసి సాయంత్రం బహిరంగసభలో పాల్గొననున్నారు.

నెటి కందం- నేటికి అందం

ఎరిగిన వైద్యజ్ఞానము
నారిగిన స్వాస్థ్యమును గావ నుపయోగింపన్
సరిగున సేవలనాసరుచు
ఒరగెడి పైద్యులకు నుత్సవము జరుపవలెన్!!

-రాధశ్రీ
సెల్:9494481210

జులై 1 జాతీయ వైద్యుల దినోత్సవం..)
July 1 National Doctors Day)

ఆదివాసీలపై పెట్టిన పోడు భూముల కేసులన్నీ ఎత్తివేస్తాం : సీఎం కేసీఆర్

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 30:పోడుభూములు కొట్టేసినందుకు ఆదివాసీ గిరిజన బిడ్డలపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇక వారిపై ఎలాంటి కేసులు ఉండవని స్పష్టం చేశారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత పేదల బతుకుల గురించి ఆలోచించి చాలా కార్యక్రమాలు తీసుకొచ్చామని చెప్పారు.

' తెలంగాణ ఉద్యమం సమయంలో అడవి ప్రాంతాలు తిరుగుతున్నప్పుడు.. మావా నాటె.. మావా రాజ్.. నా గూడెంలో నా రాజ్యం.. మా తండాలో మా రాజ్యం అని చెప్పేవాళ్లు. అనేక దశాబ్దాలు మీరు పోరాటం చేసినా అది సాధ్యం కాలేదు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాదాపు 3 నుంచి 4వేల గిరిజన గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాదు.. కుమ్రంభీమ్ పేరిట కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటు చేసుకున్నాం. ఉద్యమం సమయంలో మీరంతా సహకరించి నాతో పోరాటంలో ఉన్నారు కాబట్టి తెలంగాణ రాష్ట్రం వచ్చింది. తెలంగాణ వచ్చింది కాబట్టే కుమ్రంభీమ్ జిల్లా వచ్చింది. ఈ రోజు ఆసిఫాబాద్ జిల్లా చాలా చక్కటి ఎస్పీ, కలెక్టరేట్ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నందుకు అందరికీ హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. ఒకప్పుడు బెజ్జూర్ నుంచి ఆదిలబాద్ పోవాలంటే చాలా బాధపడేవాళ్లు. కానీ ఇప్పుడు జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయం, ఇంకా చాలా జిల్లా కార్యాలయాలు మీ ముంగిట్లకే రావడం చాలా సంతోషించే విషయం.' అని సీఎం కేసీఆర్ అన్నారు.' వర్షాకాలం వచ్చిందంటే మంచం పట్టిన మన్యం అని ఒకప్పుడు పేపర్‌లో వార్తలు వచ్చేవి. అంటురోగాలతో ఆదిలాబాద్ ఆడవిబిడ్డలు సతమతమై చనిపోయేవాళ్లు. మిషన్ భగీరథ ద్వారా చక్కటి నీళ్లు తెచ్చుకున్నాం. వైద్య వ్యవస్థను బాగుచేసుకున్నాం కాబట్టి ఇవాళ మన్యం మంచం పట్టే సమస్య లేనే లేదు. గత మూడేండ్లుగా అటువంటి దుస్థితి నుంచి బయటఒడ్డాం. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడం చాలా అద్భుతమైన విషయం. ఆ విషయంలో కూడా సక్కూ గారికి, లక్ష్మీగారికి, మీ అందరికీ హృదయ పూర్వక అభినందనలు.' అని సీఎం కేసీఆర్ తెలిపారు.' కోనేరు కోనప్ప వెంటబడి ప్రాణహిత మీద బ్రిడ్జి మంజూరు చేయించారు. కొన్ని కొత్త మండలాలు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా ఇప్పుడు కౌటాల మండలం నుంచి వార్ధా నది మీదుగా మహారాష్ట్ర పోవడానికి బ్రిడ్జి కావాలని చెప్పిండు. 75 కోట్లతో దాన్ని మంజూరు చేయడం జరిగింది. ఆ జీవోను ఇప్పుడే అందజేస్తున్నా. ఆసిఫాబాద్‌కు టెక్నికల్ కాలేజీ కావాలని కోనప్ప అడిగారు. వెంటనే ఐటీఐ కాలేజీని కాగజ్‌నగర్‌కు మంజూరు చేస్తున్నా అని తెలియజేస్తున్నా. నాగమ్మ చెరువులో బుద్ధుడిని పెట్టుకున్నాం.. దాన్ని మినీ ట్యాంక్‌బండ్‌లా ఏర్పాటు చేయాలని అడిగారు. వెంటనే ఎస్టిమేట్ చేయించి నాగమ్మ చెరువును కూడా పర్యాటక కేంద్రంగా మారుస్తాం. ' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

తెలంగాణ వచ్చిన తర్వాత పేదల బతుకులను ఆలోచించి చాలా కార్యక్రమాలు తీసుకున్నాం. ఒక్క ఆసిఫాబాద్ జిల్లాల్లోనే 47వేల ఎకరాలకు గిరిజన పోడు పట్టాలు ఇస్తున్నాం. ఇందాకే డజన్ పట్టాలు అందజేశా. రేపట్నుంచే మీ మంత్రి, ఎమ్మెల్యేలు ఈ 47వేల ఎకరాల భూమిని వెంటనే అందజేస్తారు. రానున్న మూడు రోజుల్లోనే పట్టాలు అందుతాయి. పట్టాలు అందడమే కాదు.. అందరూ రైతులకు వచ్చినట్టుగా పోడు పట్టాలు పొందినవారికి ఈ ఫసల్ నుంచే రైతుబంధు రాబోతున్నది. గతంలో 300 కోట్లు పెట్టి ఎక్కడెక్కడ అటవీ ప్రాంతాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో త్రీఫేజ్ వైర్ కనెక్షన్ లేదో అక్కడ 300 కోట్లు పెట్టి కరెంట్ ఇవ్వమని చెప్పినం. అయితే బావుల్లోకి ఇంకా పోలేదని సక్కూగారు చెప్పారు. దీనిపై చీఫ్ సెక్రటరీకి ఆదేశాలివ్వడం జరిగింది. ఎవరెవరు ఆదివాసీలు, గిరిజన బిడ్డలకు త్రీఫేజ్ కరెంట్ లేదో వాళ్లకు రాబోయే రెండు మూడు నెలల్లోనే పొలాలకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడం జరగుతుంది. పోడుభూములు కొట్టుకున్నందుకు ఆదివాసీ గిరిజన బిడ్డల మీద గతంలో కేసులు పెట్టిండ్రు. ఒకవైపు పట్టాలు ఇచ్చి ఆ కేసులు అలాగే ఉంచితే తలాతోక లేనట్టు అవుతుంది కాబట్టి వెంటనే ఆ కేసులను ఎత్తివేస్తాం.. వారిపై కేసులు ఉండవు. ' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

ఘనంగా ఆషాడ బోనాల ఉత్సవాలు : మంత్రి తలసాని

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాతనే ఆషాడ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అంబర్ పేట లోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద జులై 16 వ తేదీన నిర్వహించే బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి బోనాల ఉత్సవాలకు సరైన ఏర్పాట్లు చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మన సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తూ ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అంతేకాకుండా బోనాలను ప్రజలు గొప్పగా జరుపుకోవాలనే ఉద్దేశంతో వివిధ ఆలయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం 15 కోట్ల రూపాయలను విడుదల చేసిందని వివరించారు.

దేశంలో ప్రైవేట్ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఈ నెల 22 వ తేదీన గోల్కొండ లో బోనాలు ప్రారంభమైనాయని, వచ్చే నెల 9 వ తేదీన సికింద్రాబాద్ మహంకాళి బోనాలు నిర్వహించడం జరుగుతుందని, 16 వ తేదీన హైదరాబాద్ బోనాలు జరుగుతాయని పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలకు వారం ముందే ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెల 10, 11 తేదీలలో 16 వ తేదీన బోనాల ఉత్సవాలు నిర్వహించే ఆలయాలకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంతో గొప్పగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని, ఎలాంటి ఆటంకాలు కలగకుండా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో వైభవంగా బోనాలను నిర్వహించేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం, ఆలయాల వద్ద భారికేడ్ లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. భక్తులు, వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారిమళ్లించే విధంగా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయాల పరిసరాలలో, బోనాలను తీసుకొచ్చే రహదారులలో ఎక్కడా సీవరేజ్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భక్తులకు త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహంకాళి ఆలయం ముందున్న ప్రధాన రోడ్డు నిర్మాణం చేపట్టి భక్తులు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆలయాల పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసేందుకు అదనంగా పారిశుధ్య సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా పరిసరాలలో అవసరమైన చోట్ల అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు కూడా చేపట్టాలని అన్నారు. అభివృద్ధి పనులను బోనాలకు ఉత్సవాల నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రూప్ 4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి...!జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, జూన్ 30 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో జూలై 1న నిర్వహించనున్న గ్రూప్- 4 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 101 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 33,456 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. 24 మంది రూట్ ఆఫీసర్లు,24 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను,101 మంది చీఫ్ సూపరింటెండెంట్ లు, 101 మంది లైజన్ అధికారులను,అవసరమైనంత మంది ఇన్విజిలేటర్ లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

గ్రూప్ 4 పరీక్షలపై టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన కీలక సూచనల్ని అభ్యర్థులు విధిగా పాటించాలని తెలిపారు.గ్రూప్ 4 పరీక్ష ప్రారంభం కావడానికి 15 నిమిషాల ముందే గేట్లు మూసివేస్తారని, (ఉదయం పరీక్షకు

ఉ 9.45 గంటలకు, మధ్యాహ్నం 2.15 గంటలకు గేట్లు మూసివేస్తారు) నిర్ణీత సమయానికి ముందే అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

×పేపర్-1 (జనరల్ స్టడీస్) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ×పేపర్-2× (సెక్రటేరియల్ ఎబిలిటీస్) మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు.

పేపర్-1కు ఉదయం 8 గంటల నుంచి 9.45 గం వరకు , పేపర్-2కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.15 గం. వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని, అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే ముందు భద్రతా సిబ్బందికి, పరీక్ష గదిలోకి చేరుకున్నాక ఇన్విజిలేటర్‌కు ఫొటో గుర్తింపుకార్డు, హాల్ టికెట్ ను చూపించాలని, తనిఖీ చేసిన తర్వాతే అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు.

అభ్యర్థి కాకుండా పరీక్షకు వేరే వ్యక్తులు హాజరైనట్లు గుర్తిస్తే పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు సంబంధిత అభ్యర్థిని పరీక్షలకు అనర్హుడిగా ప్రకటిస్తారన్నారు.

భారీ సంఖ్యలో అభ్యర్థులు పరీక్ష వ్రాస్తు న్నందున ఈసారి వేలిముద్రను తప్పనిసరి చేశారని, నామినల్ రోల్‌లో సంతకం తరువాత ఎడమచేతి బొటన వేలిముద్ర కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించారని తెలిపారు.

వేలిముద్రలను పరీక్ష అయిపోయిన తర్వాత అభ్యర్థులు నామినల్ రోల్ పైన చేయవలసి ఉంటుందని, వేలిముద్ర వేసిన తరువాతే అభ్యర్థులు బయటకు వెల్లాలన్నారు.

ప్రతి సెషన్ పరీక్ష ముగిశాక ఓఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు అందజేసి వేలిముద్ర వేయాలన్నారు. అరగంటకోసారి అభ్యర్థులకు సమయాన్ని గుర్తుచేస్తూ బెల్ మోగిస్తారని, పరీక్ష ముగియడానికి 5 నిమిషాల ముందు బెల్ మోగిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రశ్నపత్రంపై సమాధానాలను మార్క్ చేయకూడదని తెలిపారు.

ఓఎంఆర్ జవాబు పత్రంలో హాల్‌టికెట్ నంబరు, ప్రశ్నపత్రం నంబరు, పరీక్ష కేంద్రం కోడ్, అభ్యర్థి పేరుతో పాటు సంతకం చేయాలన్నారు.

ఓఎంఆర్ పత్రంలో ×బ్లూ/బ్లాక్ పెన్‌తో పేరు, కేంద్రం కోడ్, హాల్‌టికెట్ నంబర్, ప్రశ్నపత్రం నంబరు రాయాలని తెలిపారు.

హాల్‌టికెట్, ప్రశ్నపత్రం నంబరు సరిగ్గా రాయకున్నా, బ్లూ/ బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌కాకుండా ఇంక్‌పెన్, జెల్‌పెన్, పెన్సిల్ ఉపయోగించినా ఓఎంఆర్ పత్రం చెల్లుబాటు కాదని తెలిపారు. అభ్యర్థి తప్పిదాల వల్ల ఓఎంఆర్‌మార్క వీలు కాదని, రాయడం మరియు బబ్లింగ్‌జాగ్రత్తగా చేయాలని సూచించారు.ఎలక్ట్రానిక్ పరికరాలు, రిమోట్‌తో కూడిన కారు తాళాలు, విలువైన, నిషేధిత వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని, అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, షూ వేసుకొని రావద్దని తెలిపారు.

సింగరేణి గెస్ట్ హౌస్‌లో మొక్కలు నాటిన సీఎస్ శాంతకుమారి

హైదరాబాద్, జూన్ 30: శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి గెస్ట్ హౌస్ లో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంత కుమారి శుక్రవారం శ్రీరాంపూర్ వచ్చిన సందర్భంగా అతిథి గృహం ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రామగుండం కమిషనర్ అఫ్ పోలీస్ రేమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకేన్, సింగరేణి అధికారులు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి : మంత్రి కేటీఆర్

మహబూబాబాద్, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ గిరిజన బిడ్డలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర మున్సిపల్ , ఐటీ శాఖల మంత్రి కే తారకరామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజనులకు పోడుభూముల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు.

ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా ట్రైబల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామని పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ప్రభుత్వం హామీ ఇచ్చింది. కేంద్రం అడిగితే గిరిజన యూనివర్శిటీ కోసం 360 ఎకరాల భూమిని ములుగు జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయినా ఇప్పటి వరకు వర్శిటీని ఎందుకు నెలకొల్పడం లేదని కేంద్రాన్ని కేటీఆర్ నిలదీశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం స్టీల్ అథారిటీ ద్వారా పెడుతామని హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలు అయింది. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ అన్నారు. కాని నేడు మోసం చేస్తున్నారు. రైళ్లను తయారు చేసే కోచ్ బదులు మరమ్మతులు చేసే దుకాణం పెడుతున్నారు. ఇది ఎంతో అన్యాయమని ఆరోపించారు.

ఇచ్చిన మాట తప్పినందుకు తెలంగాణ ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని, ఇచ్చిన హామీలపై వరంగల్ పర్యటనలో ప్రధాని మోదీ సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో 21వేల కోట్లరూపాయలతో కోచ్ ఫ్యాక్టరీ పెట్టారని ఆరోపించారు. గుజరాత్‌కు ఒక న్యాయం. తెలంగాణకు ఒక న్యాయమా . ఇది మంచి పద్ధతి కాదని కేటీఆర్ అన్నారు. దేశానికి ప్రధాని మంత్రి తప్పా గుజరాత్‌కు కాదని అన్నారు.కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావడానికి ఆడే అబద్ధాలను అసలే నమ్మవద్దని కోరారు. 50 సంవత్సరాలు మోసం చేశారు. మళ్లీ మోసం చేయడానికి వస్తున్నరు. ఆగం కావద్దని సూచించారు. అన్ని రకాలుగా పేదలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను భారీ మెజారిటీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికులతో కలుపుగోలుగా ముచ్చటిస్తూ ఢిల్లీ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. ఈ విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు ము ఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఢిల్లీ మెట్రోలో ఆయన ప్రయాణికులతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.ఢిల్లీ మెట్రో రైలులో యువతీ, యువకులు, మహిళలతో మోదీ ఎంతో ఆత్మీయం గా, నవ్వుతూ ముచ్చటించారు. చాలా కాలం నుంచి పరిచయం ఉన్న స్నేహితులతో మాట్లాడినట్లుగా వీరి హావభావాలు కనిపించాయి.ఢిల్లీ విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మోదీ ముఖ్య అతిథిగా, విద్యా శాఖ మంత్రి ధర్మేం ద్ర ప్రధాన్ గౌరవ అతిథిగా పాల్గొం టున్నారు. ఈ సందర్భంగా మోదీ టెక్నాలజీ ఫ్యాకల్టీ, కంప్యూటర్ సెం టర్, అకడమిక్ బ్లాక్ భవనాల నిర్మా ణానికి శంకుస్థాపనలు చేస్తారు. కాఫీ టేబుల్ పుస్తకాలను ఆవిష్కరిస్తారు. ఓ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఆహ్వానము

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీత్యాగరాయ గానసభ

" కవిశేఖర " శ్రీ జన్నా భట్ల నరసింహప్రసాద్ రచించిన
" వ్యాస మంజూష " గ్రంథావిష్కరణ - డా॥ హిప్పే పద్మాకమలాకర్ గారికి
అంకితోత్సవం మరియు జన్నాభట్ల నరసింహప్రసాద్ కథలు,
నవలికలు - పరిశీలన పై పరిశోధన గావించి డాక్టరేట్ పొందిన
డా॥ మట్టా హారిక, విజయవాడ అభినందన సత్కారం

ముఖ్య అతిథి :
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్
ప్రముఖ రామాయణ పండితులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

గౌరవ అతిథి :
ప్రా॥ ముదిగొండ శివప్రసాద్
చారిత్రక నవలా చక్రవర్తి

సభాధ్యక్షులు :
శ్రీ పాత్తూరి సుబ్బారావు
సంపాదకులు, రామాయణ కిరణం

సభాప్రారంభం :
శ్రీ కళా వి.ఎస్.జనార్ధనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

అతిథుల సత్కారం :
శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటి నిజం

పుస్తక సమీక్ష :
శ్రీ పెద్దూరి వెంకటదాసు
కవి, రచయిత

కీలక ప్రసంగం :
శ్రీమతి శేషభట్టార్ రజిత ఆచార్య
కూచిపూడి నాట్యగురువు

కృతి స్వీకర్త

డా॥ హిప్పే పద్మాకమలాకర్

స్వాగతం :
డా॥ హిప్పే పద్మాకమలాకర్
డా॥ మట్టా హారిక,
శ్రీ జనాభట్ల నరసింహప్రసాద్

అభినందన సత్కార స్వీకర్త

డా॥ మట్టా హారిక, ఖమ్మం

సాంస్కృతిక కార్యక్రమం : సంగీత విభావరి
గానం : శ్రీ లక్ష్మీనరసింహ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, సంగీత గురువు, నాగారం, శ్రీమతి జన్నా భట్ల లక్ష్మీకామేశ్వరి గారి శిష్యులు. మెరుగు విష్ణు భగవాన్, టి. అర్జున్, టి. చరణ్, డి. దృవన్, కె. సత్యసాయిసుజయ్, కె. యశస్విన్, గానవి, గొర్తి శ్రీధన్వి
కూచిపూడి నృత్యం : బేబి శేషభట్టార్ ఆరోహి శరణ్య

08-07-2023, శనివారం, కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

లయన్ గుబచిండి వెంకటరెడ్డి, ఛైర్మన్
లయన్ వి.వి. రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి , జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

శ్రీమతి కళా శారదా దీక్షితులు
ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ

అకౌంటింగ్, ఫైనాన్సియల్ రంగాల్లో నిర్వహించే 2వ అతి పెద్ద వృత్తి నిబద్ధతగల సంస్థ ఐసిఏఐ

(01 జూలై 'జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్స్ దినం' సందర్భంగా)

01 జూలై 1949న 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఏఐ)' సంస్థ పార్లమెంట్‌లో చట్టం ద్వారా స్థాపించబడింది. ప్రపంచంలోనే అకౌంటింగ్, ఫైనాన్సియల్ విషయాలను నిర్వహించే రెండవ అతి పెద్ద వృత్తి నిబద్ధతగల సంస్థగా ఐసిఏఐ పేరు సంపాదించుకుంది. ఐసిఏఐ స్థాపించబడిన 01 జూలై రోజున దేశవ్యాప్తంగా 'జాతీయ చార్టర్ అకౌంటెంట్స్ (సిఏ) దినం' నిర్వహించుట ఆనవాయితీగా జరుగుతుంది.. ఐసిఏఐ లోగోలో గరుడ పక్షితో పాటు శ్రీ అరబిందో సూచించిన కఠోపనిషత్ సూక్తి 'యే ఈశా సుప్తేషు జాగ్రతీ (నిద్రించే వారిలో మేల్కొన్న వ్యక్తి)'ని పొందుపరిచారు.

ఐసిఏఐ గత ఘన చరిత్ర:

1913లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంపెనీల చట్టం ద్వారా ఆడిటర్లను నియమించడం జరిగింది. 1918లో 'గవర్నమెంట్ డిప్లమా ఇన్ అకౌంటెన్సీ' కోర్సును ప్రవేశపెట్టడం జరిగింది. ఆడిటర్లుగా ఎంపిక చేయబడిన అభ్యర్థులకు 3 ఏండ్ల శిక్షణ కాలం ఉండేది. 1930లో భారత ప్రభుత్వం 'రిజిస్టర్డ్ అకౌంటెంట్ల' జాబితా నమోదు చేయడం ప్రారంభించింది. అనంతరం 1948లో నియమించిన కమిటీ సిఫార్సులతో 1949, 01 జూలై రోజున ఐసిఏఐ సంస్థను చట్టం ద్వారా స్థాపించడం జరిగింది. ఆ రోజు నుంచి ఇండియన్ అకౌంటెంట్లను 'చార్టర్డ్ అకౌంటెంట్లు లేదా సిఏ'గా పిలవడం ఆనవాయితిగా మారింది.

సిఏల పాత్ర అమోఘం:

చిరు వ్యాపారం నుంచి బహుళజాతి సంస్థ వరకు, చిన్న ఉద్యోగి నుంచి బడా బాబుల వరకు అందరి ఆర్థిక లావాదేవీలను క్రమపద్ధతిలో చట్టబద్ధంగా ఆదాయవ్యయాల జాబితాను నిర్వహించే అమూల్య బాధ్యత సిఏలపై ఉంటుంది. దేశ ఆర్థిక క్రమశిక్షణను నియంత్రించే బాధ్యతలను సిఏలు భుజాన వేసుకెని నడిపిస్తున్నారు. అతి గౌరవ ప్రదమైన సిఏ వృత్తిలో ఆకర్షణీయ ఆదాయం ఉంటుంది. సిఏ వృత్తి ద్వారా ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లో వ్యక్తిగతంగా, కంపెనీల పరంగా జమ, ఖర్చుల విశ్లేషణతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయ పన్నులను నిర్ణయించే చెల్లింపులు జరిగేలా సిఏలు సేవలు అందిస్తారు.

సిఏ ఎంపికకు కఠిన పరీక్షలు:

ఐసిఏఐ నిర్వహించే ఉన్నత ప్రమాణాలతో కూడిన కఠిన సిఏ పరీక్షలో వేలల్లో అభ్యర్థులు పాల్గొన్నప్పటికీ కొద్ది మంది మాత్రమే ఉర్తీర్ణులు కావడం విశేషం. దేశంలో ఐసిఏఐ నుంచి సర్టిఫికెట్ పొందిన తొలి వ్యక్తిగా 'గోపాల్‌దాస్ పదమ్సే కపాడియా' గుర్తింపు పొంది ఐసిఏఐ ప్రథమ అధ్యక్షుడిగా సేవలు అందించారు. స్వతంత్ర భారతావనిలో అతి పురాతన సంస్థల్లో ఒకటిగా పేరుగాంచిన ఐసిఏఐలో ఎలాంటి రిజర్వేషన్లు ఉండవు, ప్రతిభ మీద మాత్రమే సిఏలను కఠిన నియమావళితో కూడిన పరీక్షల ద్వారా వడపోసి ఎంపిక చేస్తారు.

సామాన్య జనులు 'జాతీయ సిఏల దినం' వేదికగా ఆ వృత్తిలో అత్యున్నత సేవలు అందిస్తున్న సిఏలను గుర్తించి సన్మానించు కోవడం జరుగుతుంది. సిఏ వృత్తి పట్ల అవగాహన, ఐసిఏఐ బాధ్యులను గుర్తించడం, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించవచ్చు. నేటి విద్యార్థినీవిద్యార్థులు, ఉన్నత విద్యనభ్యసించిన యువత సిఏ పరీక్షలో ఉర్తర్ణులై దేశం గర్వించే సిఏలుగా ఎంపిక కావాలని కోరుకుందాం. మన సమీపాన నివసిస్తున్న సిఏలకు జాతీయ సిఏల దినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

తరగతుల నిర్వహణకై అన్ని ఏర్పాట్లు చేయండి: మంత్రి హరీష్ రావు

– పాత కలెక్టరేట్ భవనంలోని 8ఎకరాల్లోని భవనలు అధునీకరణ పనులు పరిశీలించిన మంత్రులు హరీష్, పువ్వాడ

ఖమ్మం, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంజిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి 100 సీట్లతో నిర్వహించనున్న కళాశాల తరగతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు అధికారులను ఆదేశించారు.

శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో పోడు భూమల పట్టాలను పంపిణీ అనంతరం హెలికాప్టర్ ద్వారా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం కు మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు ఖమ్మం చేరుకున్నారు. అనంతరం నేరుగా పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి కొనసాగుతున్న ఆధునీకరణ పనులను మంత్రి హరీష్ రావు పరిశీలించారు. మెడికల్ కళాశాలలో కొనసాగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి చేసి నకాలంలో తరగతులు నిర్వహించేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్ భవనం 5ఎకరాలు, ఆర్‌ఎబి కార్యాలయం 3ఎకరాలు మొత్తం 8 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కళాశాలను ఏర్పాటు చేశామని, ఈ విద్యా సంవత్సరం తరగతులు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టామని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం ప్రకారం అనుమతి లభించిన దరిమిలా తరగతుల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉందన్నారు. వారి వెంట స్పెషల్ సీఎస్ రామకృష్ణ రావు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములు నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, ఐటీడిఏ పివో గౌతమ్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, డిఎంహెచ్వో మాలతీ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

వైసీపీ అధినేతకు బైరెడ్డి అల్టిమేటం జారీ చేశారా..?

అమరావతి జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వైపీ సీఎం వైఎస్ జగన్ రెడ్డికి యువనేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రూపంలో పెద్ద చిక్కు వచ్చి పడిందా..? వైసీపీ అధినేతకు అల్టిమేటం జారీ చేశారా..? మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గం.. ఈ నాలుగింటిలో ఎక్కడో ఒకచోట పోటీకి దింపుతున్నట్లు ప్రకటిస్తే సరే లేకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తేల్చిచెప్పేశారా..? ఇన్నిరోజులు పార్టీకి సేవలు చేసిన తగిన గుర్తింపు, ఇచ్చిన పదవితో సంతృప్తిగా లేరు.. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ లేదా పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని డిసైడ్ అయ్యారా..? అంటే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఇవన్నీ అక్షరాలా నిజమే అని తెలుస్తోంది. ఇంతకీ బైరెడ్డి ఇంత కీలక నిర్ణయం ఎందుకు తీసుకున్నారు..? యువనేత కోరుతున్న ఆ నియోజకవర్గాలేంటి..? ఒకవేళ ఆ నాలుగింటిలో ఏదో ఒక సీటు ఇచ్చినా అక్కడున్న సిట్టింగ్‌ల పరిస్థితేంటి..? అసలు వైసీపీలో ఏం జరుగుతోంది..?

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి.. యూత్‌లో ఈయనకున్న క్రేజే వేరు.. తెలుగు రాష్ట్రాల్లో ఈ యువనేతకు భారీగా అభిమానులున్నారు.. ఈయన సభ పెట్టినా, ఇంటి నుంచి బయటికొచ్చినా వందలాది మంది అభిమానులు, అనుచరులు వచ్చేస్తుంటారు. యూత్‌లో ఇంత క్రేజ్ ఉందిగనుకే దాన్ని క్యాష్ చేసుకోవడానికే అప్పట్లో బైరెడ్డిని వైసీపీలోకి ఆహ్వానించి కండువా కప్పారు జగన్.

మొదట అనుకున్నంత ప్రియారిటీ లేకున్నప్పటికీ ఆ తర్వాత ఏదో కాస్తో కూస్తో ప్రాధాన్యత ఉన్న శ్యాప్ బాధ్యతలను జగన్ కట్టబెట్టారు కానీ.. రోజుకో వివాదం తప్పితే ఇంతవరకూ క్రీడలను ఉద్దరించిన దాఖలాల్లేవ్. దీంతో బైరెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారట. తన సేవలను నియోజకవర్గం, జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వినియోగించుకుంటూ.. కనీసం చట్టసభలకు కూడా పంపరా..? ఇదేం న్యాయం అని అధిష్టానాన్ని బైరెడ్డి నిలదీశారట.

అందుకే రానున్న ఎన్నికల్లో కర్నూలు సిటీ, పాణ్యం, శ్రీశైలం ఈ మూడింటిలో ఏదో ఒకచోట టికెట్ ఇవ్వాలని.. కుదరని పక్షంలో నంద్యాల ఎంపీ సీటు అయినా సరే ఇవ్వాలని.. ఇవేవీ ఇవ్వని పక్షంలో కీలక నిర్ణయమే తీసుకోవాల్సి వస్తుందని డైరెక్టుగా జగన్‌కు అల్టిమేటం జారీచేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఎమ్మెల్యే లేకపోతే ఎంపీగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి చట్టసభల్లోకి అడుగుపెట్టాలని ఈసారి గట్టిగానే బైరెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నది వ్యక్తమవుతుంది.

పుట్టిన నేల , దేశం బాగుండాలి అనే భావనతోనే రాజకీయాలలోకి వచ్చా -పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 30:నేరస్తులను ఎదుర్కోవాలంటే చట్టాల మీద అవగాహన ఉన్న వ్యక్తుల మద్దతు అవసరం అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను అధిగమించి ముందుకు వెళ్లాలన్నా చట్టాల మీద సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తులు కావాలన్నారు. రాజకీయాల్లోకి పోరాట పటిమ, విలువలు ఉన్న వారు రావాలన్నది తన ఆకాంక్ష అని అన్నారు. ప్రముఖ న్యాయవాది తోట సుధీర్ లాంటివారు జనసేన పార్టీలో చేరికతో అది నెరవేరిందన్నారు. కాకినాడ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, కాకినాడ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ తోట సుధీర్ శుక్రవారం భీమవరం నిర్మలా ఫంక్షన్ హాల్లో జరిగిన ఓ కార్యక్రమంలో జనసేన పార్టీలో చేరారు. ప్రముఖ న్యాయవాది తోట సుధీర్ కి పవన్ కళ్యాణ్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన కుటుంబ సభ్యులు డాక్టర్ తోట అనంత లక్ష్మి, డాక్టర్ తోట కావ్య, తోట శక్తిలతో మాట్లాడారు. వారి వెంట వచ్చిన వారికి పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకూడదు. అది అసాధ్యమేమీ కాదు. వైసీపీ జెండా ఎగరకూడదన్నది.. ఎవరెస్ట్ ఎక్కడం కంటే ఎంతో సులభం. వైసీపీ గెలవకూడదు అనడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. వైసీపీ పాలనలో యువతకు ఉపాధి లేదు.. రైతులకు లాభం సంగతి పక్కన పెడితే కనీసం గిట్టుబాటు ధర దక్కడం లేదు. గిట్టుబాటు కల్పించకపోగా ప్రతి బస్తాకీ రూ.వంద చొప్పున దోచుకుంటున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయి. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. సగటు యువతకు ఉపాధి, రైతుకి గిట్టుబాటు ధర లాంటివి సాధించాలంటే చట్టాల మీద అవగాహన ఉన్న వ్యక్తుల సమూహం అవసరం. తోట సుధీర్ లాంటి వ్యక్తుల రాకతో పార్టీ బలంగా పుంజుకుంటుంది. సుధీర్ తో వ్యక్తిగత సాన్నిహిత్యం ఉన్నా ఎప్పుడూ రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానించలేదు. వారి కుటుంబం మొత్తం మద్దతు ఇచ్చి పంపారు. ఆయనతోపాటు పార్టీలో చేరేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ 5 వేల మందిని కదిలించే శక్తి ఉంది. వచ్చే ఎన్నికల్లో కాకినాడలో జనసేన జెండా ఎగరాలి. రాజకీయాల్లో అమ్ముడుపోవడం తేలిక. నా మటుకు నాకు పుట్టిన నేల బాగుండాలి.. దేశం బాగుండాలి అన్న కోరిక తప్ప మరే కోరికా లేదు. అడ్డదారులు తొక్కకుండా నిజాయతీగా రాజకీయాలు చేయడం చాలా కష్టం. ఆ విధంగా నిలబడ్డాం కాబట్టే ఈ రోజు ప్రతి ఒక్కరూ మన వైపు వస్తున్నారు" అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, పీఏసీ సభ్యులు పంతం నానాజీ, ముత్తా శశిధర్, పితాని బాలకృష్ణ, అమలాపురం ఇంఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, కాకినాడ నగర అధ్యక్షులు సంగిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పదిహేడో ఇండియన్ కోఆపరేటివ్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 30:జూలై 1 వ తేదీ నాడు సహకార సంఘాల అంతర్జాతీయ దినం సందర్భం లో ఉదయం 11 గంటల వేళ కు న్యూ ఢిల్లీ లోని ప్రగతి మైదాన్ లో జరిగే పదిహేడో ఇండియన్ కోఆపరేటివ్ కాంగ్రెసు ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించనున్నారు.

'సహకార్ సే సమృద్ధి' సంబంధి దార్శనికత పట్ల ప్రధాన మంత్రి కి ఉన్నటువంటి ప్రగాఢ విశ్వాసం తో స్ఫూర్తి ని పొందిన ప్రభుత్వం దేశం లో సహకార ఉద్యమాని కి ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు నిరంతరాయం గా చర్యల ను చేపడుతూ వస్తోంది. ఈ ప్రయాస కు బలాన్ని ఇవ్వడానికని ప్రత్యేకం గా సహకార మంత్రిత్వ శాఖ నంటూ ఒక మంత్రిత్వ శాఖ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధాన మంత్రి ఇండియన్ కోఆపరేటివ్ కాంగ్రెస్ కార్యక్రమం లో పాలుపంచుకోవడం ఈ దిశ లో మరో ముందడుగు అని చెప్పాలి.

పదిహేడో ఇండియన్ కోఆపరేటివ్ కాంగ్రెస్ ను 2023 జూలై 1 మరియు 2వ తేదీల లో నిర్వహించడం జరుగుతుంది. సహకార ఉద్యమం లో వివిధ ధోరణుల ను గురించి చర్చించి, ప్రస్తుతం ఆచరిస్తున్న ఉత్తమ అభ్యాసాల ను చాటిచెప్పడం, ఈ రంగం లో ఎదురవుతున్న సవాళ్ళ ను గురించి చర్చోపచర్చల ను జరపడం మరియు భారతదేశం లో సహకార ఉద్యమం యొక్క వృద్ధి కై రాబోయే కాలం లో అమలుపరచవలసిన విధాన పరమైనటువంటి దిశ ను రూపొందించుకోవడం ఈ కాంగ్రెస్ యొక్క ధ్యేయాలు గా ఉన్నాయి. "అమృత కాలం: ఒక చైతన్య వంతమైనటువంటి భారతదేశాన్ని ఆవిష్కరించడం కోసం సహకార రంగం ద్వారా సమృద్ధి ని సాధించడం" అనే ప్రధాన ఇతివృత్తం పై ఆధారపడే ఏడు సాంకేతిక సదస్సుల ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీనిలో 3600 కు పైగా స్టేక్ హోల్డర్స్ పాలుపంచుకొంటారు. వారి లో ప్రాథమిక స్థాయి మొదలుకొని జాతీయ స్థాయి వరకు విస్తరించినటువంటి సహకార సంఘాలు, అంతర్జాతీయ సహకార సంస్థల ప్రతినిధులు, ఇంటర్ నేశనల్ కోఆపరేటివ్ అలయన్స్ ప్రతినిధులు, మంత్రిత్వ శాఖ లు, విశ్వవిద్యాలయాలు, ప్రముఖ సంస్థ లు, తదితర వర్గాల ప్రతినిధులు కూడా కలసి ఉంటారు.

వీరన్నపేటలో చిరుత సంచారం- అప్రమత్తంగా ఫారెస్ట్ అధికారుల సూచన

మహబూబ్‌నగర్, జూన్ 30:మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేట సమీపంలో గల కేటీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రాంతంలో రాత్రి సమయంలో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. గురువారం రాత్రి వీధుల వెంబడి తిరుగుతూ పెంపుడు శునకంపై చిరుత పులి దాడి చేసి చంపేసింది. ఉదయం లేచి చూచిన స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనవుతున్నారు. సమీపంలో అటవీ ప్రాంతం ఉండటంతో ఇటీవల తరచుగా చిరుత రాత్రి సమయంలో గట్టిగా అరుస్తూ భయాందోళనకు గురి చేస్తుందని, బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై స్థానికులు స్థానిక కౌన్సిలర్ కు సమాచారం అందించడంతో కౌన్సిలర్ సమాచారం మేరకు శుక్రవారం ఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నిరంజన్ సిబ్బందితో చిరుత ఆనవాళ్లను గుర్తించారు.

కేటీఆర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవి వైపు వెళ్లొద్దని, ముఖ్యంగా చిన్నపిల్లలను బయటకు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఈ అడవి ప్రాంతంలో సుమారు పదికి పైగా చిరుతపులులు సంచరిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు.

ఎవరైనా ప్రజలు అత్యవసరంగా అడవి వైపు వెళ్లాలి అనుకుంటే ఇద్దరు లేదా ముగ్గురు వెళ్లాలని ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. చిరుతపులి కూడా మనిషిలాగే తీవ్రంగా భయపడే జంతువని, ఒంటరిగా ఉన్న వారిపైన దాడి చేసింది తప్ప, మనుషులకు అది తీవ్రంగా భయపడుతుందని తెలిపారు.

మంత్రి హరీష్ రావుకు ఘనస్వాగతం పలికిన చింతనిప్పు కృష్ణచైతన్య

ఖమ్మం, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య,నీటిపారుదల,ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఖమ్మం పర్యటనకు విచ్చేసిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ స్వగృహంకు వచ్చిన సందర్భంగా మంత్రి హరీష్ రావుకు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లాఅధ్యక్షులు చింతనిప్పు కృష్ణచైతన్య ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి హరీష్ రావును కృష్ణచైతన్య మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహుకరించారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో వైసీపీకి బిగ్ షాక్..

విజయవాడ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అవనిగడ్డ నియోజకవర్గ వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. పర్చూరి సుభాష్ చంద్రబోస్, ఆయన అనుచరులు టీడీపీలో చేరనున్నారు. సుభాష్ చంద్రబోస్‌తో పాటు అవనిగడ్డ, కోడూరు మండలాల నుంచి చేరికలు ఉండనున్నాయి. మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో సుభాష్ చంద్రబోస్, మిగిలిన నేతలు పార్టీలో చేరనున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని చూడలేక పార్టీని వీడుతున్నట్లు సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం సాధ్యమని తెలుగుదేశంలో చేరున్నట్లు తెలిపారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో నేతలంతా మంగళగిరి బయలుదేరుతున్నారు.



డ్యూరాండ్ కప్ 'ట్రోఫీ టూర్'ను ప్రారంభించిన సైనిక, వాయు దళాల అధిపతులు

న్యూఢిల్లీ, జూన్ 30:చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, అఖిల భారత ఫుట్‌బాల్ సంఘం (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు కల్యాణ్ చౌబే కలిసి 132వ డ్యూరాండ్ కప్ పోటీల "ట్రోఫీ టూర్"ను ప్రారంభించారు. ఇవాళ దిల్లీ కాంట్‌లోని మానెక్‌షా సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేడుకలో "ట్రోఫీ టూర్"ను ప్రారంభించారు. ఇది, భారతదేశ పురాతన ఫుట్‌బాల్ టోర్నమెంటు.

ఈ క్రీడా పోటీలు కోల్‌కతాలో ఆగస్టు 03 నుంచి సెప్టెంబర్ 03 వరకు జరుగుతాయి. "ట్రోఫీ టూర్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి యువ ఫుట్‌బాల్ క్రీడాకారులు, క్రీడా ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

డ్యూరాండ్ కప్ పోటీలు ఆసియాలో అత్యంత పురాతనమైనది, ప్రపంచంలో మూడో పురాతన ఫుట్‌బాల్ టోర్నమెంటు ఇది. భారతదేశంలోని అగ్రశ్రేణి ఫుట్‌బాల్ జట్లు ఇందులో పాల్గొంటాయి. భారత సాయుధ దళాలు దీనిని నిర్వహిస్తాయి. ఫుట్‌బాల్ క్రీడలో భారతదేశ ప్రతిభను దశాబ్దాలుగా డ్యూరాండ్ కప్ చాటుతోంది, ప్రతిభావంతులను వెలికి తీస్తోంది. తొలి పోటీలు 1888లో సిమ్లాలో జరిగాయి. తొలుత, ఆర్మీ కప్‌గా ఈ టోర్నమెంటు ప్రారంభమైంది. భారతదేశంలోని బ్రిటీష్ ఇండియన్ సైనిక దళాలకు మాత్రమే అప్పట్లో ప్రవేశం ఉండేది. తర్వాతి కాలంలో పౌర జట్లు పాల్గొనడానికి కూడా అనుమతి లభించింది.

డ్యూరాండ్ కప్ టోర్నమెంటు విజేత జట్లుకు మూడు జ్ఞాపికలు బహూకరిస్తారు, అందుకే ఈ టోర్నమెంటు చాలా ప్రత్యేకమైనది. విజేత జట్లుకు డ్యూరాండ్ కప్ (రోలింగ్ ట్రోఫీ, ఇదే అసలు జ్ఞాపిక), సిమ్లా ట్రోఫీ (రోలింగ్ ట్రోఫీ, సిమ్లా వాసులు 1904లో తొలిసారి అందించారు), ప్రెసిడెంట్స్ కప్ (విజేత జట్టు శాశ్వతంగా దాచుకునే కప్, 1956లో భారతదేశపు మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మొదటిసారి అందించారు) లభిస్తాయి. రాబోయే నెల రోజుల్లో, ట్రోఫీ టూర్‌లో భాగంగా ఈ మూడు జ్ఞాపికలను సిమ్లా, ఉధంపూర్, జైపూర్, ముంబై, పుణె, బెంగళూరు, భువనేశ్వర్, కోక్రాఝార్, గువాహతి, షిల్లాంగ్ సహా కొన్ని ప్రధాన నగరాల్లో ప్రదర్శిస్తారు. ఈ విధంగా ఇవి దేశంలోని అన్ని మూలలను చుట్టి వస్తాయి. కోల్‌కతాలో టోర్నమెంటు ప్రారంభ సమయానికి ఆ నగరానికి చేరుకుంటాయి.

నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ జట్లు సహా 24 జట్లు 132వ టోర్నమెంటులో పాల్గొంటున్నాయి. 27 సంవత్సరాల విరామం తర్వాత విదేశీ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. అన్ని దేశీయ జట్లకు తలుపులు ఎప్పుడు తెరిచే ఉండాయి. అఖిల భారత ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలోని డ్యూరాండ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ సొసైటీ (డీఎఫ్‌టీఎస్) ఈ పోటీలను నిర్వహిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ, క్రీడాస్ఫూర్తి, పోటీతత్వానికి ఈ టోర్నమెంటు ఎప్పుడూ నిదర్శనంగా నిలుస్తోంది.

బిజెపికి తలనొప్పిగా మారిన రాజాసింగ్ సస్పెన్షన్ వ్యవహారం

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ వ్యవహారం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. సస్పెన్షన్ తొలగించాలంటూ కార్యకర్తలు రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. రాజసింగ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఇప్పటికే పార్టీ హైకమాండ్‌కు రెండు సార్లు బండి సంజయ్ లేఖ రాశారు. రాజసింగ్ సస్పెన్షన్ వ్యవహారంపై విజయశాంతి ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. సస్పెన్షన్ ఎత్తివేత ఆలస్యమవుతోందని కార్యకర్తలు భావిస్తున్నారని విజయశాంతి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సస్పెన్షన్ ఎత్తివేత ఆలస్యమైతే పార్టీకి నష్టం తప్పదని కార్యకర్తలు అంటున్నారు.

తాజా పరిణామాల నేపథ్యంలో బీజేపీకి రాజసింగ్ సస్పెన్షన్ వ్యవహారం ఇబ్బందికరంగా మారింది.

విజయశాంతి తన ట్వీట్‌లో ఏమన్నారంటే..

''ఎమ్మెల్యే రాజాసింగ్ గారి సస్పెన్షన్ అంశంలో బీజేపీ నిర్ణయం కొంత ఆలస్యమవుతున్నట్లు మన కార్యకర్తలు అభిప్రాయపడుతున్నరు. అయితే, బండి సంజయ్ గారితో సహా రాష్ట్ర పార్టీ అంతా ఆ సస్పెన్షన్ తియ్యబడాలని మనఃపూర్వకంగా కోరుకుంటున్నము.

అలాగే జరుగుతుందని నమ్ముతున్నం. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు, కార్యకర్తలు ఉన్న భారతీయ జనతా పార్టీ తన కార్యకర్తలకు న్యాయం చేసుకోకుంటే ఇంత శక్తి వస్తదా... సరైన సమయంలో అంతా మంచే జరుగుతాది.

కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా ఆదరించే బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా ఆచితూచి వ్యవహరిస్తుంది. ఆలస్యమైనట్లు కనిపించినా అంతిమ నిర్ణయం కచ్చితంగా అందరికీ మంచి చేసేదే అవుతుంది'' అని విజయశాంతి ట్వీట్‌లో పేర్కొన్నారు.

తెలంగాణ జనగర్జన సభను విజయవంతం చేయండి

- పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్

ఖమ్మం, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): పొంగులేటి శ్రీనన్న కాంగ్రెస్ పార్టీలో చేరిక నేపథ్యంలో జూలై 2వ తారీఖున జరిగే తెలంగాణ జనగర్జన మహాసభను జయప్రదం చేయవలసింది గా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పండితాపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ...ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ భరోసా ఇచ్చి ఆదుకుంటున్న జనహృదయనేత పొంగులేటి శ్రీనన్న ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ పాలనను గద్దె దించాలని లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా పార్టీ పెద్దలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి విచ్చేయుచున్నారని వారి సమక్షంలో పొంగులేటి శ్రీనన్నతో పాటు అభిమానులు, భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మల్లి బాబు యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహా ముద్రం లాంటిదని, చిన్నపాటి కార్యకర్త నుండి పెద్ద నాయకులకు ప్రాతినిధ్యం ఉంటుందని, ఇతర పార్టీలలో లాగా పక్షపాత ధోరణి ఉండదని నిజమైన ప్రజాస్వామ్యం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటుందని అభిప్రాయపడ్డారు. పొంగులేటి శ్రీనన్న ఆదేశాల మేరకు కామేపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలు, కార్యకర్తల్ని కలుపుకొని జన సమీకరణ చేసి దాదాపు 15వేల మందిని జనగర్జన సభకు తరలి ంచడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల మాజీఅధ్యక్షులు భానోతు నరసింహ నాయక్, శీలం పుల్లయ్య, తొండల ముత్తయ్య, మేకల మహేష్ బాబు, బండి ఉపేందర్, పాటిబండ్ల ప్రసాద్, మొగిలి శ్రీను, దొడ్డ నాగేశ్వర్ రావు, బానోతు లక్ష్మానాయక్ తదితరులు ఉన్నారు.

మేలో అల్ టైమ్ హై 10.6 మిలియన్లను దాటిన ఆధార్ ఆధారిత ముఖ ప్రామాణీకరణ లావాదేవీలు

న్యూఢిల్లీ, జూన్ 30:సర్వీస్ డెలివరీ కోసం ఆధార్ ఆధారిత ముఖ ప్రామాణీకరణ లావాదేవీలు అక్టోబర్ 2021లో ప్రారంభించినప్పటి నుండి మే నెలలో 10.6 మిలియన్ల ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. తద్వారా నెలవారీ లావాదేవీలతో బలమైన ఊపందుకుంటున్నాయి.

10 మిలియన్ల కంటే ఎక్కువ ముఖ ప్రామాణీకరణ లావాదేవీలను నమోదు చేసుకోవడం ఇది వరుసగా రెండో నెల. ముఖ ప్రామాణీకరణ లావాదేవీల సంఖ్య పెరుగుతున్న పథంలో ఉంది మరియు మేలో నెలవారీ సంఖ్యలు 38 శాతం పెరిగాయి. జనవరి 2023లో నివేదించబడిన లావాదేవీలతో పోలిస్తే ఇది పెరుగుతున్న వినియోగాన్ని సూచిస్తుంది.

యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ద్వారా అంతర్గతంగా అభివృద్ధి చేయబడిన ఏఐ/ఎంఎల్ ఆధారిత ముఖ ప్రామాణీకరణ సొల్యూషన్ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు మరియు కొన్ని బ్యాంకులతో సహా 47 సంస్థలు ఉపయోగిస్తున్నాయి.

దీని అనేక ఉపయోగాలలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద లబ్ధిదారులను నమోదు చేయడానికి ఉపయోగించబడుతుంది; పిఎం కిసాన్ పథకంలో లబ్ధిదారుల ప్రామాణీకరణ కోసం మరియు పెన్షనర్లు ఇంటి వద్ద డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌లను రూపొందించడం కోసం కూడా ఉపయోగపడుతోంది.

అలాగే అనేక ప్రభుత్వ విభాగాలలో సిబ్బంది హాజరును గుర్తించడానికి మరియు వారి వ్యాపార కరస్పాండెంట్ల ద్వారా కొన్ని అనేక రాష్ట్రాలలో అర్హత కలిగిన ఉన్నత విద్య విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం జగనన్న విద్యా దీవెన పథకానికి మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు సంక్షేమ డెలివరీ కోసం ఈబిసి నేస్తం పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధార్ ఆధారిత ముఖ ప్రామాణీకరణను ఉపయోగిస్తోంది.

ముఖ ప్రామాణీకరణ వాడుకలో సౌలభ్యం, వేగవంతమైన ప్రామాణీకరణ వంటి లక్షణాలను అందిస్తుంది. వేలిముద్ర మరియు ఓటిపి ప్రమాణీకరణలతో పాటు ప్రామాణీకరణ విజయ రేటును బలోపేతం చేయడానికి ఇది అదనపు పద్ధతిగా ప్రాధాన్యతనిస్తుంది. ఇది ప్రామాణీకరణ కోసం ప్రత్యక్ష చిత్రాలను సంగ్రహిస్తుంది. ఏదైనా వీడియో రీప్లే దాడులు మరియు సామాజిక వ్యతిరేక అంశాల ద్వారా స్టాటిక్ ఫోటో ప్రామాణీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఇది సురక్షితం.

మాన్యువల్ వర్క్ లేదా ఆరోగ్య సమస్యలతో సహా అనేక కారణాల వల్ల వారి వేలిముద్రల నాణ్యతతో సమస్యలు ఉన్న సీనియర్ సిటిజన్‌లు మరియు అందరికీ సహాయం చేయడం ద్వారా ఫేస్ అథెంటికేషన్ కూడా బలమైన ప్రత్యామ్నాయంగా పని చేస్తుంది.

నివాసితుల అభ్యర్థనను అనుసరించి మే నెలలో యుఐడిఏఐ 14.86 మిలియన్ల ఆధార్ అప్‌డేట్‌లను అమలు చేసింది.

ఆధార్ ఇ-కెవైసి బ్యాంకింగ్ సేవ మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టార్‌లలో పారదర్శకమైన మరియు మెరుగైన కస్టమర్ అనుభవాన్ని అందించడం ద్వారా మరియు సులభంగా వ్యాపారం చేయడంలో సహాయం చేయడం ద్వారా కీలక పాత్ర పోషిస్తోంది. మే నెలలోనే 254 మిలియన్లకు పైగా ఇ-కెవైసి లావాదేవీలు జరిగాయి.

మే 2023 చివరి నాటికి, ఆధార్ ఇ-కెవైసి లావాదేవీల సంచిత సంఖ్య 15.2 బిలియన్లను దాటింది. ఇ-కెవైసిని కొనసాగించడం వల్ల ఆర్థిక సంస్థలు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు వంటి సంస్థల కస్టమర్ సముపార్జన ఖర్చు గణనీయంగా తగ్గుతోంది.

చివరి మైల్ బ్యాంకింగ్ కోసం ఏఇపిఎస్ అయినా, గుర్తింపు ధృవీకరణ కోసం ఇ-కెవైసి అయినా, ప్రత్యక్ష నిధుల బదిలీ లేదా ధృవీకరణల కోసం డిబిటిని ప్రారంభించిన ఆధార్, భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పునాది మరియు సుపరిపాలన సాధనం, నివాసితుల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

తెలంగాణలో బీజేపీలో ఆధిపత్య పోరు... కమలానికి బిగ్ షాక్ తగలనుందా..?

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్); తెలంగాణలో బీజేపీలో ఆధిపత్య పోరు నడుస్తున్న వేళ.. కమలానికి బిగ్ షాక్ తగలనుందా..? సిట్టింగ్ ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారా..? పార్టీ కోసం అహర్నిశలు శ్రమించినా గుర్తింపు లేదని ఆవేదన చెందుతున్నారా..? కొంత కాలంగా బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆయన ఇక భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడానికి సిద్ధపడ్డారా..? అంటే తాజా పరిణామాలను.. ఆ ఎమ్మెల్యే చేసిన ప్రకటన బట్టి చూస్తే ఇది అక్షరాలా నిజమయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అసలే బీజేపీ గందరగోళ పరిస్థితులు, దీనికి తోడు, రాష్ట్ర అధ్యక్షుడి మార్పు, తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు కీలక నేతలకు వదవులు కట్టబెడుతున్నారన్న పరిస్థితుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నట్లుండి బాంబ్ పేల్చారు. దీంతో బీజేపీలో అసలేం జరుగుతోంది..? పార్టీ బలోపేతం అవుతోందా లేకంటే ఇంకేమైనా జరుగుతోందా..? అని క్యాడర్ అయోమయంలో పడింది. ఇంతకీ ఎవరా ఎమ్మెల్యే.. ఎందుకింత రచ్చ..? పార్టీ నుంచి ఆయన ఏం ఆశిస్తున్నారు..? అనే విషయానికి వస్తే ..కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ బీజేపీలో ఒక్కసారిగా పెనుమార్పులు వచ్చేశాయ్.. అప్పటి వరకూ అదిగో.. ఇదిగో కేసీఆర్‌ను గద్దె దించేస్తున్నాం.. అని టైమ్ చెప్పి మరీ హడావుడి చేసిన కమలనాథులు ఒక్కసారిగా డీలా పడిపోయారు. ఈ క్రమంలోనే ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మధ్య వర్గ విబేధాలు తలెత్తాయ్. దీంతో రెండు వర్గాలు చీలిపోయిన నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేయడం.. ఇదే సమయంలో ఈటల లేదా డీకే అరుణకు అధ్యక్ష పదవి ఇస్తారని వార్తలు రావడంతో ఒక్కసారిగా బీజేపీ నేతలు భగ్గుమన్నారు. అంతేకాదు.. బండికి కేంద్రంలో కీలక పదవి ఇస్తారని కూడా టాక్ నడిచింది. నాటి నుంచి నేటి వరకూ బండి పదవి, అధ్యక్షుడి మార్పుపై రోజుకో వార్త వస్తూనే ఉంది. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే సీనియర్ నేత, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి ట్విట్టర్ వేదికగా పోస్టు చేసిన వీడియోపై రచ్చ రచ్చ జరుగుతోంది. ఈ వ్యవహారం సద్దుమణగక ముందే.. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతోన్నవారికి బీజేపీలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు.. కొంతకాలంగా పార్టీ కార్యాలయానికి దూరంగా.. సొంత నియోజకవర్గం దుబ్బాకలోనే ఉన్న ఆయన సడన్‌గా ఇలా కామెంట్స్ చేయడంతో ఏదో తేడా కొడుతోందని అందరూ అనుకుంటున్నారు.

గ్రూపురాజకీయాలకు చేస్తున్న వారికే హైకమాండ్ అందదండలు

'బీఆర్ఎస్ ప్రభుత్వంపై (పోరాడుతున్న నాకు పార్టీ నుంచి ఎలాంటి సహకారం లేదు. గ్రూపురాజకీయాలకు చేస్తున్న వారికే హైకమాండ్ అందదండలు ఉన్నాయి. బీజేపీ ఫ్లోర్ లీడర్ పదవి అడిగినా ఇంతవరకూ నాకు ఇవ్వలేదు. ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ తర్వాత ఫ్లోర్ లీడర్ పదవి ఖాళీగానే ఉంది. జాతీయ అధికార ప్రతినిధి లేదా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా అవకాశం వస్తుందని కనీసం రాష్ట్ర పార్టీలో అయినా తగిన ప్రాధాన్యత ఇస్తారని నేను భావిస్తున్నాను' అని తన ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో చెప్పుకుని రఘునందన రావు తీవ్ర ఆవేదనకు లోనయ్యారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకాదు.. ఇటీవల హైదరాబాద్ వచ్చిన జేపీ నడ్డాతో కూడా ఎమ్మెల్యే తన అసంతృప్తిని తెలియజేశారట. అయితే ఇంత జరిగిన తర్వాత అయినా తన రియాల్టీని గుర్తించి పార్టీ పెద్దలు పదవి ఇస్తే బాగుంటుందని భావిస్తున్నా రట. అయితే.. బీజేపీ అగ్రనేతల నుంచి తనకు ఎలాంటి పదవిగానీ గుర్తింపు లేకుంటే మాత్రం కీలక నిర్ణయమే తీసుకునే అవకాశం ఉందని రఘు అనుచరులు చెప్పుకుంటున్నారు. మరోవైపు.. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించకుంటే తెలంగాణలో బీజేపీ పని ఖతమే అని ఎమ్మెల్యే అభిమానులు, ముఖ్య కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.దీనితో 'కమలంలో కల్లోల్లం' రోజురోజుకూ పెరుగుతూనే ఉందే తప్ప ఈ గందరగోళ పరిస్థితులకు మాత్రం ఫుల్ స్టాప్ పడే పరిస్థితులు మాత్రం కనిపించట్లేదు. ఇప్పటి వరకూ ఇతర పార్టీల నుంచి నేతలు అసంతృప్తి వెళ్లగక్కగా.. ఇప్పుడు ఏకంగా సొంత పార్టీ, అది కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే ఇలా ఆవేదన వెలిబుచ్చారంటే పార్టీలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. రఘునందన్ డిమాండ్ మేరకు అధిష్టానం స్పందిస్తే సరే లేకుంటే బీజేపీకి గుడ్ బై చెప్పేసినా ఆశ్చర్య పోనక్కర్లేదేమో మరి..!!!

పోడు రైతులకు రైతుబంధు,ఉచిత విద్యుత్

- ఖమ్మం జిల్లాలో పట్టాలపంపిణీ సభలో మంత్రి హరీష్ రావు ప్రకటన
- పోడుదారులకు పట్టాలుపంపిణీచేసిన మంత్రులుహరీష్ రావు,పువ్వాడ
- పార్టీకిపట్టిన పీడవిరగడఅయ్యింది..శకుని పాత్రలు వెళ్లిపోయాయి
- వెన్నుపోటుదారులు వెళ్లిపోయారంటు ఘాటు వ్యాఖ్యలు చేసినమంత్రిహరీష్ రావు

ఖమ్మం, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణి చేసిన రైతులకు ఇక నుండి రైతు బంధు, ఉచిత విద్యుత్ వధకాన్ని వర్తించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు ప్రకటించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రం భక్త రామదాసు కళాక్షేత్రంలో అర్హులైన 6589మందికి గాను13,139.05ఎకరాలకు పోడు రైతులకు పట్టాలను మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ పంపిణీ చేశారు. తొలుత నిన్న అకాల మరణం చెందిన వేద సాయిచంద్ మృతి పట్ల మంత్రులుగ్రాంతి వ్యక్తం చేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఇల్లందు నియోజకవర్గాల పరిధిలో ని77గ్రామ పంచాయతీలు,9మండలాల పరిధిలో ఉన్న6589మంది పోడు రైతులకు గాను 13,139.04ఎకరాలు పోడు రైతులకు పాస్ పుస్తకాలను మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఖమ్మం జిల్లాలో పార్టీకి పట్టిన పీడ విరగడ అయ్యిందని, శకుని పాత్రలు వెళ్లిపోయాయని అన్నారు. పార్టీలో ఇంత కాలం ఉన్న పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే వాళ్ళు వెళ్లి పోయారంటు విమర్శలు గుప్పించారు. మాకు వద్దు అనీ పక్కనపెట్టిన అలాంటి వాళ్ళను కాంగ్రెస్ తీసుకుంటున్నదని, అరాచక వాధి అని అన్నోల్లను ఇప్పుడు అదే పార్టీలో భట్టి చేర్చుకుంటున్నాడని విమర్శించారు. ఇంతక ముందు ఒకటి గెలిచిన తొమ్మిది ఓడినం, ఈసారి ఖమ్మంలో పదికి తొమ్మిది స్థానాలు గెలుస్తామన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో ఆసరా రూ.2000/4000 వేలు ఇస్తున్న రాష్ట్రం ఉందా..? కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో రైతుబంధు, రైతుబీమా పథకాలు ఇస్తున్న రాష్ట్రం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో కళ్యాణ లక్ష్మి అమలు జరుగుతుందా. కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో మిషన్ భగీరథ నీళ్లు ఇస్తున్నారని చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులాంటిది కట్టారా.. కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో కేసీఆర్ కిట్లు ఇస్తున్నారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలోనైన తెలంగాణలో అమలవుతున్న ఏ ఒక్క పథకమైన అమలవుతుందా..కాంగ్రెస్ పాలనలో రైతన్నలు కరెంటు కోసం సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు చేయలేదా దమ్ముంటే చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో నేతన్నలు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలు లేవా ఖమ్మం వస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా అని సూటిగా ప్రశ్నించారు. వారి వెంట స్పెషల్ సీఎస్ రామకృష్ణ రావు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములు నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, ఐటీడీఏ పివో గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వర రావు, కార్పొరేటర్ లు, మాజీ ఎమ్మెల్యేలు మధన్ లాల్, బానోత్ చంద్రావతి, అధికారులు ఉన్నారు.

జైలు సూపరింటెండెంట్‌కు సన్మానం

మహబూబ్ నగర్ జూన్ 20(ఎక్స్ ప్రెస్ న్యూస్); జైలు సూపరింటెండెంట్ ఖైదీలకు అందుబాటులో ఉంటూ నిత్యావసరాలు, ఆరో గ్యాన్ని పర్యవేక్షించడం ప్రశంసనీయమని "సహాయ ఫౌండేషన్" వ్యవస్థాపక అధ్యక్షులు "టంకరి శివప్రసాద్ యాదవ్ అన్నారు జిల్లా జైలు పర్యవేక్షణా ధికారి వెంకటేశ్వర్లును ''సహాయ ఫౌండేషన్'' వ్యవస్థాపక అధ్యక్షులు ''టంకరి శివప్రసాద్ యాదవ్'' నేతృత్వం లో ఫౌండేషన్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జైలు ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఇతర కార ణా లతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవా ని ఆదుకునేందుకు రక్తదా తును ప్రోత్సహిం చాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిల వాలని పిలుపుని చ్చారు. ఈ సన్నర్భంగా "డిఎస్పీ.మహేష్"ను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నవీన్, భరత్ చారి, జయకర్, అనిల్, రాజు, శివ, భరత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి

ఆదిలాబాద్, జూన్ 30: గుడిహత్నూర్ మండలంలోని కోలారి గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ గా పనిచేస్తున్న దత్తు శుక్రవారం విద్యుత్ స్తంభం పైకి ఎక్కి బల్బులు భిగిస్తుండగా విద్యుత్ షాక్ తో మృతిచెందాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వలన ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నారని గ్రామస్తులు అన్నారు. ఎల్ సి తీసుకున్నా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు, దీనికి బాధ్యత వహించాలని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం
ఉమ్మడి కరీంనగర్ జిల్లా
ఆహ్వానము
ప్రముఖ కవి, రచయిత, కాలమిస్టు
డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన
మధుపాళీ... మధు క(విత)వనం కవితా సంపుటి
గ్రంథ ఆవిష్కరణ సభ
తేది : 04-07-2023 మంగళవారం సా॥ గం॥6.15 ని॥లకు వేదిక : ఫిలిం భవన్, కరీంనగర్
ముఖ్య అతిథి & మధు క(విత)వనం ఆవిష్కర్త :
శ్రీ దేశపతి శ్రీనివాస్ గారు, ఎమ్మెల్సీ
విశిష్ట అతిథి :
శ్రీ జి.వి.శ్యాంప్రసాద్ లాల్ గారు, అదనపు జిల్లా కలెక్టర్, కరీంనగర్
సభాధ్యక్షులు :
శ్రీ దాస్యం సేనాధిపతి గారు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
గౌరవ అతిథులు :
డా॥ గండ్ర లక్ష్మణ్ రావు గారు, ప్రముఖ సాహితీవేత్త శ్రీ వారాల ఆనంద్ గారు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత
పుస్తక పరిచయం :
శ్రీ ఏ. గజేందర్ రెడ్డి గారు, అధ్యక్షులు, సమతా సాహితి
ఆత్మీయ అతిథులు :
శ్రీ జి.వి.ఆర్. గోపాల్ రెడ్డి గారు, చైర్మన్, నిగమ గ్రూప్ ఆఫ్ కాలేజెస్
శ్రీ సంది శ్రీనివాస్ గారు, అధ్యక్షులు, సాహితీ గౌతమి
శ్రీ గాజుల రవీందర్ గారు, అధ్యక్షులు, జాతీయ సాహిత్య పరిషత్
శ్రీ కొత్త అనిల్ కుమార్ గారు, అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
శ్రీ కె.ఎస్. అనంతాచార్య గారు, ప్రధాన కార్యదర్శి, సమైక్య సాహితి
శ్రీ వైరాగ్యం ప్రభాకర్ గారు, అధ్యక్షులు, ఉదయ సాహితి
ఆహ్వానించువారు : బొమ్మకంటి కిషన్, కార్యదర్శి అనుముల దయాకర్, కోశాధికారి

రాబోవు ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి-వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్

వరంగల్, జూన్ 30:రానున్న శాసనసభ ఎన్నికల నిర్వహణకు పోలీసు అధికారులు సన్నద్ధం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ వీ రంగనాథ్ పిలుపునిచ్చారు. నెలవారి నేర సమీక్షలో భాగంగా శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ వరంగల్ కమిషనరేట్ పోలీసు అధికారులతో కాజీపేటలోని నిట్ సమావేశ ప్రాంగణంలో నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. డిసిపిలు, అదనపు డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా ఆదివారం నిర్వహించబడే గ్రూప్ 4 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, పరీక్షలు నిర్వహించబడే కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ క్రైమ్స్ డిసిపి మురళీధరు ను అడిగి తెలుసుకోవడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో పరీక్షా కేంద్రాల వద్ద తగురీతిలో భద్రత ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

అనంతరం రానున్న ఎన్నికలపై పోలీస్ కమిషనర్ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన వారితో పాటు గతంలో ఎన్నిక సందర్భంగా నేరాలకు పాల్పడిన వ్యక్తులను బైండోవర్ చేయాలని, డబ్బు, మద్యం, గంజాయి రవాణాతో పాటు బెల్ట్ షాపులపై అధికారులు నజర్ పెట్టాలని, స్టేషన్ పరిధిలో గతంలో నేరాలకు పాల్పడిన లేదా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వ్యక్తుల సమచారం సేకరించాలని, ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు తెలిపారు. సాధారణ పోలీస్ విధులపై పోలీస్ కమిషనర్ అధికారులతో ప్రస్తావిస్తూ అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, నైపుణ్యంతో కూడిన దర్యాప్తు కొనసాగించాలని, ముఖ్యంగా కీలకమైన కేసుల్లో సాక్షుల వాంగ్మూలాన్ని వీడియో రికార్డు చేయాల్సిన అవసరం వుందని, నేరస్తులకు శిక్ష పడేందుకు దర్యాప్తు అధికారులు ఖచ్చితమైన సాక్ష్యాధారాలను అందజేయాలని తెలిపారు. అలాగే అనుమానాస్పద మృతికి సంబంధించిన కేసుల్లో దర్యాప్తు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ లోతుగా దర్యాప్తు చేయాలని, విధుల్లో భాగంగా అధికారులు సవాళ్ళను స్వీకరిస్తూ ఒత్తిళ్ళను అధిగమిస్తూ విధులు నిర్వహించి, నిరుపేద వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో క్రైమ్స్ డిసిపి మురళీధర్, ఈస్ట్, వెస్ట్ జోన్ డిసిపిలు కరుణాకర్, సీతారాం, ట్రైనీ ఐపిఎస్ అంకిత్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు హాజరయ్యారు.

పోలీస్ కమిషనరేట్ పాత వాహన విడిభాగాల వేలం :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ మోటార్ ట్రాన్స్ పోర్ట్ లో పాత వాహనాలకు సంబంధించిన మరమ్మత్తులు చేసిన వాహన విడిభాగాలు, టైర్లు, బ్యాటరీలను రేపు అనగా జులై ఒకటవ తేదిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మోటార్ విభాగం ప్రాంగణంలో ఉదయం పది గంటలకు వేలం నిర్వహించబడును. ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు ఈ వేలంగా పాల్గొనవచ్చని తెలిపారు

విజయసాయి రెడ్డిని కలిసిన కర్రి వేణుమాధవ్

తాడేపల్లి జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వైఎస్ఆర్సిపి రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వి విజయసాయి రెడ్డిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జి కర్రి వేణుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. జులై 16వ తారీఖున విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ ఏయూ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే విశాఖ బీసీ గర్జన హాజరుకావలసింది ఆహ్వానించినట్టు తెలిపారు.

ఇప్పటికే ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మరియు ఉత్తరాంధ్ర వైయస్ఆర్సీపీ ఇన్చార్జి వైవి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 50 సంవత్సరాల ఉద్యమ నాయకుడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య గారికి ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ గారికి స్వర్ణ కంకణ ధారణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టుగా కర్రి వేణుమాధవ్ తెలిపారు.

పలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంనగరం 55వ డివిజన్ బైపాస్ రోడ్ నందు రూ.90లక్షలతో నిర్మించనున్న సీసీ సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఖమ్మం నగరాభివృద్ధిలో భాగంగా కోట్ల రూపాయలు వెచ్చించి సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్స్ నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు. ఆయా పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, సుడా చైర్మన్ విజయ్ కుమార్, ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, వెంకటేశ్వర చారి, వేగినాటి మధు, యుగంధర్, ప్రవీణ్, రమేష్ తదితరులు ఉన్నారు.

వాణిజ్య ఎగుమతుల లక్ష్యం ఒక ట్రిలియన్ డాలర్లకు చేరేందుకు వీలుగా ఎంఎస్ఎంఇలకు అధిక మొత్తంలో పరపతి సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి- శ్రీ పియూష్ గోయల్

న్యూఢిల్లీ, జూన్ 30:వాణిజ్య ఎగుమతుల లక్ష్యం ఒక ట్రిలియన్ డాలర్లకు చేరేందుకు వీలుగా ఎంఎస్ఎంఇ లకు అధికమొత్తంలో రుణాలనుఅందుబాటులోకి వచ్చేలా చూడాలని శ్రీ గోయల్ భారతీయ బ్యాంకులను కోరారు. ఎంఎస్ఎంఇ లకు ఎగుమతుల కోసం రుణాలుపెంచడం విషయం చర్చించడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ గోయల్ ఈ మాటలన్నారు. ఎక్స్పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఈ సి జి సి) సహకారంతో కేంద్ర వాణిజ్య శాఖ న్యూఢిల్లీలో బుధవారం ఈ సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశానికి భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్ బి ఐ) , బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియా సహా 21 బ్యాంకుల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

'బ్యాంకులకు ఎగుమతి పరపతి మరియు ఎగుమతి పరపతి బీమా' అనే అంశంపై ఈ సి జి సి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎం. సెంథిల్ నాథన్ వివరణాత్మక ప్రదర్శన సమర్పించారు. ఈ పథకం అమలులో తమకు ఉన్న గత అనుభవాల దృష్ట్యా ఎంఎస్ఎంఇ ఎగుమతిదారులలో ఎక్కువమందికి అధికమొత్తంలో రుణాలను అందుబాటులోకి తేవడానికి మరిన్ని సవరణలు చేయాలని ఈ సి జి సి ప్రతిపాదించింది. ప్రతిపాదిత సవరణల ప్రకారం రుణగ్రహీత ఖాతాలను 'ఏ ఏ' ఖాతాలుగా పరిగణించి ఎగుమతి దారులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తారు.

ఈ స్కీము కింద ప్రస్తుతం తొమ్మిది బ్యాంకుల ద్వారా ఎంఎస్ఎంఇ లకు ఎగుమతి రుణాలు ఇస్తున్నారు. దానిని అన్ని బ్యాంకులకు విస్తరించే విషయాన్ని ఈ సి జి సి పరిశీలించాలని తద్వారా ఎంఎస్ఎంఇ ఎగుమతిదారులకు రుణాల మొత్తం పెంచవచ్చని శ్రీ పియూష్ గోయల్ అన్నారు.

దావాలను పరిష్కరించడానికి ఈ సి జి సి కూడా సూక్ష్మ, చిన్న సంస్థల క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ అనుసరిస్తున్న విధానాన్ని అనుసరించాలని బ్యాంకర్లు సూచించారు. నష్టపరిహారం చెల్లింపు కోసం ఈ సి జి సి కూడా అదే పద్ధతిని పాటించాలని మంత్రి సలహా ఇచ్చారు.

ప్రతిపాదిత స్కీము ద్వారా ప్రయోజనం పొంది ఎంఎస్ఎంఇ ఎగుమతిదారులకు తగిన మొత్తంలో ఎగుమతి రుణాలను అందుబాటులోకి తేవాలని మంత్రి బ్యాంకులకు సూచించారు. తద్వారా 2030 నాటికి దేశం ఒక ట్రిలియన్ డాలర్లవాణిజ్య ఎగుమతుల లక్ష్యం చేరగలదు. అదేవిధంగా ఈ సి ఐ బి స్కీము కింద బ్యాంకుల క్లెయిమ్ చెల్లింపులను క్లెయిమ్ అందిన 45 రోజుల లోపల 75% చెల్లింపు జరిపే విషయాన్ని పరిశీలించాలని ఈ సి జి సి అధికారులకు మంత్రి సలహా ఇచ్చారు. వచ్చే నాలుగు నెలల్లో ఈ సి జి సి సేవలను డిజిటలైజ్ చేస్తామని కూడా మంత్రి తెలిపారు.

అమృత్ కలశ్ డిపాజిట్ ఎఫ్‌డీ స్కీమ్' గడువును మరోసారి పొడగించిన ఎస్‌బీఐ

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎస్‌బీఐ తన ఖాతాదారుల కోసం పున:ప్రవేశపెట్టిన 'ఎస్‌బీఐ అమృత్ కలశ్ డిపాజిట్ ఎఫ్‌డీ స్కీమ్' గడువును బ్యాంక్ మరోసారి పొడగించింది. ఆకర్షణీయ వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్న ఈ ప్రత్యేక స్కీమ్ గడువు గతంలో జూన్ 30, 2023 వరకు ఉండగా... ఇప్పుడు దానిని ఆగస్టు 15, 2023 వరకు పొడగిస్తున్నట్టు బ్యాంక్ ప్రకటించింది. గడువు తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తామని స్పష్టం చేసింది.

కాగా అమృత్ కలశ్ డిపాజిట్ స్కీమ్ డిపాజిట్ పిరియడ్‌గా డిపాజిట్ పిరియడ్ 400 రోజులుగా ఉంది. ఇక దేశీయ రిటైల్ టర్మ్ డిపాజిట్స్(రూ.2 కోట్ల కంటే తక్కువ), కొత్త డిపాజిట్లు, డిపాజిట్ల రెన్యూవల్, టర్మ్ డిపాజిట్స్, స్పెషల్ టర్మ్ డిపాజిట్లు అర్హతగా ఉన్నాయి.

టర్మ్ డిపాజిట్లు – మెచ్యూరిటీని బట్టి నెలవారీ/త్రైమాసికం/ అర సంవత్సరం స్పెషల్ టర్మ్ డిపాజిట్స్ ఉంటాయి. వడ్డీ, నికర టీడీఎస్ కస్టమర్ ఖాతాలో జమవుతాయి. ఇతర విషయాలకు వస్తే.. ఆదాయ పన్ను చట్టం ప్రకారం టీడీఎస్ రేటు వర్తిస్తుంది. రిటైల్ టర్మ్ డిపాజిట్ వర్తింపునకు అనుగుణంగా విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. లోన్ సదుపాయం కూడా ఉంది. బ్రాంచ్/ ఐఎన్‌బీ/యోనో మార్గాల ద్వారా లోన్ తీసుకోవచ్చు.

కాణిపాకం ఆలయంలో 15 రోజుల హుండీ ఆదాయం రూ. కోటి

కాణిపాకం, జూన్ 30:ప్రముఖ సత్య ప్రమాణాల క్షేత్రమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానానికి హుండీ ద్వారా 15 రోజులకు రూ కోటి. 7లక్షల ఆదాయం లభించింది.

అందులో బంగారం 92.గ్రాములువెండి 1 కిలోల 200.గ్రాములు ఉన్నాయి. స్వదేశీ నగదు కాక 732 యు ఎస్. డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 51 మలేషియన్ రింగెట్లు, 20 సింగపూర్ డాలర్లు, 1,065 యూఏఈ దినారమ్స్ ఉన్నాయని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వెంకటేశు తెలిపారు.

మొత్తం గత 15 రోజుల్లో హుండీ ద్వారా రూ. 1,07,28,040 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎన్.వి.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, హరి మాధవరెడ్డి, పర్యవేక్షకులు రవి, రంగస్వామి, దేవస్థానం సిబ్బంది, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చొరవతో పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): : దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని గిరిజనుల పోడు భూముల సమస్యను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. గిరిజనులపై ప్రత్యేక అభిమానం ఉండడం వల్లే సమస్యకు పరిష్కారం దొరికిందని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం లో మంత్రు లు కేటీఆర్, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సమైక్య పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి నోచుకోలేక పోయిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతే సీఎం కేసీఆర్ నేతృత్వంలో మహబూబాబాద్ జిల్లా ఊహించని అభివృద్ధి జరిగిందని వెల్లడించారు. రాష్ట్రంలో లక్షా 51 వేల 146 మంది గిరిజనులకు పోడు భూముల పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మహబూబాబాద్ జిల్లాలో 24 వేల 181 మంది లబ్ధిదారులకు 67 వేల 730 ఎకరాల పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే వానాకాలం పంట సహాయం కింద జిల్లాలో సుమారు రూ.33.86 కోట్ల రైతుబం ధును అందించామని పేర్కొన్నారు. కొత్తగా పోడు పట్టాలు పొందే గిరిజన రైతులకు సైతం రైతుబంధు పంట పెట్టుబడి సహాయం ఇస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి కృషి చేసిన కేసీఆర్‌కు ప్రజలు రుణపడి ఉండాలని కోరారు. 3,146 తండాలు, గూడాలను గ్రామపంచాయతీలుగా చేశామని తెలిపారు. కాంగ్రెస్ పాలకుల విమర్శలు, కుట్రలు తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

సిఎస్,డిజిపిలతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఎకె భల్లా వీడియో సమావేశం

అమరావతిజూన్30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో కనీసం మౌలిక సదుపాయాల కల్పన అనగా రహదారులు, సెల్ టవర్ల నిర్మాణం, వివిధ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందించడంతో పాటు వివిధ మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై శుక్రవారం ఢిల్లీ నుండి కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా సిఎస్,డిజిపిలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈవీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి,పోలీస్ డైరెక్టర్ జనరల్ కె.రాజేంద్రనాథ్ రెడ్డి,ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, పిఆర్ అండ్ ఆర్డి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరిష్ కుమార్ గుప్త,ఐటి శాఖ కార్యదర్శి కోన శశిధర్,గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతి లాల్ దండే,పిసిసిఎఫ్ ఎకె ఝూ,ఐజి ఇంటిలిజెన్స్(ఎస్బి) వినీత్ బ్రిజ్వాల్, ఐపిఎన్ అధికారి మీనా, పంచాయతీరాజ్ ఇఎన్సి పిబి నాయక్,ఆర్ అండ్బి ఇఎన్సి మాధవి సుకన్య,ఎస్పి ఇంటిలిజెన్స్ ఎస్ఐబి బాబ్జి, తదితర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కదలిరండి.. తరలిరండి.. తెలంగాణ జనగర్జన సభని విజయవంతం చేయండి

– పొంగులేటి ముఖ్యఅనుచరుడు పరికపల్లి శ్రీనివాస్

ఖమ్మం, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): జులై 2వ తేదీన ఖమ్మంలో జరగబోయే తెలంగాణ జనగర్జన సభని విజయవంతం చేయాలని పెద్దమునగాల గ్రామసర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్ కొరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ లో చేరుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిస్తూ... తెలంగాణలోనే ఈ జనగర్జన సభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని 5లక్షలకు పైగా జన సమీకరణ జరుగుతుందని సభకు వచ్చిన వారికి ఏటువంటి ఇబ్బందులుకలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని 100ఏకరాలలో సభ, పార్కింగ్ కోసం సుమారు 60 ఏకరాలు కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. తెలంగాణ తెచ్చింది... ఇచ్చింది... కాంగ్రెస్సేనని తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియా గాంధీదేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, రేణుక చౌదరి, కాంగ్రెస్ జాతీయ రాష్ట్ర ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పునాటీ బాబు, గడల నరేంద్ర నాయుడు, బండారు శ్రీను, పదిమల శ్రీను, పాపగంటి చిన్న బాబు, కావూరి శ్రీను, రచ్చ రామకోటయ్య, యూత్ అధ్యక్షుడు రంజిత్, దొడ్డ బాబు, కటుకూరి నరసింహరావు, దాసరి వీరబాబు, దండు కృష్ణ, పసుపులేటి శ్రీను తదితరు లు ఉన్నారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోడు భూముల పట్టాల పంపిణీ చేసిన మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావు,సత్యవతి రాథోడ్.

మహబూబాబాద్, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్,ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ పాల్గొని పోడు భూముల పట్టాలు పంపిణీ చేయటం జరిగింది.

మంత్రి మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమంలో సమైక్య పాలకులను తరిమికొట్టిన నేల ఈ మానుకోట అని అందుకే సీఎం కెసిఆర్ మహబూబాబాద్ ను జిల్లా కేంద్రం చేశారనీ అన్నారు.

సమైక్య పాలనలో అసలు ఇక్కడ అభివృద్ధే జరగలేదు అని,మహబూబాబాద్ జిల్లా ఏర్పడ్డాక ఊహించని అభివృద్ధి జరిగింది, జరుగుతుందని అన్నారు.

మహబూబాబాద్ జిల్లాలో అటవీ ప్రాంతం వున్నది

ఎన్నో ఏళ్లుగా గిరిజనుల పోడు భూముల సమస్య వుండేది. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ల పాలనలో ఎక్కడ కూడా ఈ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారని ,

గిరిజనులు అంటే అపారమైన ప్రేమ కలిగిన సీఎం కెసిఆర్ ఒక దారి చూపారు

అలాంటి సమస్యకు అటవీ హక్కుల చట్టం ద్వారా సీఎం కెసిఆర్ పరిష్కారం చూపారని రాష్ట్రంలో 1 లక్ష 51 వేల 146 మంది గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ చేస్తున్నాం అని అన్నారు.

ఈ రోజు జిల్లాలో 24 వేల 181 మంది లబ్ది దారులకు సంబందించిన 67 వేల 730 ఎకరాలకు పోడు పట్టాల పంపిణి చేశారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయం మేరకు 1 లక్ష 51 వేల 146 మంది కొత్త గిరిజన పోడు పట్టాదారులకు కూడా రైతుబంధు ,పంట పెట్టుబడి సహాయం ఇస్తున్నాం అని అన్నారు.

మహబూబాబాద్ లో 500 కోట్లతో మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేసుకున్నాము అని అన్నారు.

కాంగ్రెస్ పాలకుల విమర్శలు, కుట్రలు తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు .జిల్లా అభివృద్ధికి కృషి చేసిన కేసీఆర్ కి మనం రుణపడి ఉండాలనీ ఇంత చేస్తున్న సీఎం కేసీఆర్ ని మరోసారి ఆశీర్వదించాలి వారు కోరారు ? నాఈజీనినివట ఎఎ ఉఎజీతిశ్రీ

పారిశ్రామిక సెజ్‌లో భారీ అగ్నిప్రమాదం.. ఇద్దరు కార్మికులు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం

అమరావతి, జూన్ 30: ఏపీలోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం పారిశ్రామిక సెజ్(రావళి)లో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు కార్మికులు పైలా సత్తిబాబు, ఉప్పాడ తిరుపతి చికిత్స పొందుతూ మృతి చెందగా మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

ఏపీ పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్ కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనపై విచారణకు ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. కాగా ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించింది.

బీజేపీ విధానాలు నచ్చకే దళిత మోర్చా జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా : ఉపేందర్

నూర్యాపేట, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): బీజేపీలో కష్టపడే నాయకులకు , కార్యకర్తలకు గుర్తింపు దక్కడం లేదని సూర్యాపేట బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్దాస్ ఉపేందర్ ఆరోపించారు. పార్టీ అవలంభిస్తున్న విధానాలను, వైఖరిని నిరసిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. త్వరలో మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో తనతో పాటు మరికొందరు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేండ్ల పాటు బీజేపీలో క్రియాశీలంగా పనిచేసినా తగిన గుర్తింపు లేదని వాపోయారు. సూర్యాపేట నియోజకవర్గంలో గతంలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధిని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు.

సంక్షేమ పథకాలు కేవలం టీఆర్ఎస్ వాళ్లకే వస్తాయన్న అపోహలు అవాస్తవమని పేర్కొన్నారు. దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, కల్యాణలక్ష్మి పథకాలు, ఇంటింటికీ భగీరథ నీరు అందిస్తున్నా రని తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంటుతో చిన్న తరహా పరిశ్రమలు నిలదొక్కుకుంటున్నాయని చెప్పారు. ఎస్డీఎఫ్ నిధులతో చర్చిల అభివృద్ధి చేశారని తెలిపారు. మంత్రి జగదీష్ రెడ్డిని మూడోసారి గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. బీజేపీకి రాజీనామా చేసిన వారిలో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు బలుగూరి రాజు, ఓబీసీ మోర్చా పట్టణ కార్యదర్శి సోమ గాని లక్ష్మణ్, మహేందర్, మహేష్ తదితరులు ఉన్నారు.

సర్పంచ్ కుటుంబానికి బీఆరెస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ

రాజన్న సిరిసిల్ల, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామ సర్పంచ్ పెండ్యాల తిరుపతి భార్య పెండ్యాల అరుణ అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారంపరామర్శించారు. ఈ సర్పంచ్ తిరుపతి భార్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అరుణ మృతి వివరాలను ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఆత్మ శాంతి చేకూరాలని మనోహర్ రెడ్డి ఆకాంక్షించారు.ఆయన వెంటసర్పనీచులు సామ తిరుపతి రెడ్డి,కట్కం చంద్రయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉప్పుల చంద్రయ్య, ఏఎంసీ డైరెక్టర్ పెండ్యాల శంకర్, సోమినేని బాలు, రోమాల ప్రవీణ్, మొగిలి అంజయ్య, లింగంపెల్లి రాములు, కొమ్ము రణధీర్, శ్రీనివాస్, మెంగని కిషన్, శ్రీధర్, మహేష్ తదితరులు ఉన్నారు.

తోతాపురి కేజీ రూ.12లు - ఉల్లంఘిస్తే సీజ్ చేస్తాం .. కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు, జూన్ 30: జిల్లాలో మామిడి రైతులకు మేలు చేసే లక్ష్యంతో ఒక కేజీ తోతాపురి మామిడి ధర రూ.12లు గా నిర్ణయించామని తెలియచేస్తూ.. ఉల్లంఘించిన ఫ్యాక్టరీలను, మండీలను, ర్యానీప్ లను సీజ్ చేస్తామని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ హెచ్చరించారు. ఈరోజు స్థానిక జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మామిడికి గిట్టుబాటు ధరపై సంబంధిత అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఇప్పటి వరకు మన జిల్లాతో పాటు సరిహద్దులోని రాష్ట్రాలు, జిల్లాల నుండి మామిడి పంటను దిగుమతి చేసుకున్నాయని తెలిపారు. వీటి ధర తక్కువగా, నాణ్యత కాస్త మెరుగ్గా ఉన్న కారణంగా గతంలో రెండు మార్లు తోతాపురి మామిడి పంటకు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన ధరలు స్థిరంగా కొనసాగించడం వీలుపడలేదని తెలిపారు.

ప్రస్తుతం మన జిల్లా సరిహద్దులో ఉన్న ప్రాంతాల్లో మామిడి పంట కోత పూర్తి అయినదని, మన జిల్లాలో పంట దిగుబడి పూర్తి నాణ్యతతో ఉన్నందున, మామిడి రైతులు, ఫ్యాక్టరీ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసామన్నారు. ఈ సమావేశంలో రవాణా చార్జీలు కాక, ఒక కేజీ తోతాపురి మామిడి గిట్టుబాటు ధర రూ.12లుగా నిర్దేశించామని తెలిపారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు జులై 1 నుంచి అమలులో ఉంటాయన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులను నియమించి ధరల అమలును పరిశీలించడం జరుగుతుందని చెబుతూ ఉల్లంఘించిన వారి ఫ్యాక్టరీ, మండీలను, ర్యానీప్ లను సీజ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు.

మొజాంబిక్‌లోని బెయిరాలో ఐఎన్ఎస్ సునయన పర్యటన

న్యూఢిల్లీ, జూన్ 30:కోచిలోని దక్షిణ నౌకాదళ స్థావరం ఆధ్వర్యంలోని ఐఎన్ఎస్ సునయన, ఈ నెల 28న, మొజాంబిక్‌లోని బెయిరా నౌకాశ్రయం లోకి ప్రవేశించింది. సైనిక బ్యాండ్‌ల ఆహ్వానం నడుమ, మొజాంబిక్ నావికా సిబ్బంది, డీఏ ప్రిటోరియా నౌకకు స్వాగతం పలికారు. సముద్ర రంగ భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మెరుగు పరచుకోవడానికి రెండు నౌకల సిబ్బంది పరస్పర మార్పిడి, నౌకల సందర్శన, క్రీడా పోటీలు జరుగుతాయి. భారత నౌకాదళ సిబ్బంది ఆ ప్రాంతంలో వైద్య శిబిరం కూడా నిర్వహిస్తారు. నౌకాశ్రయ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత, మొజాంబిక్ నౌకాదళంతో కలిసి ఉమ్మడి ఈఈజెడ్ నిఘా కోసం నిర్వహిస్తారు.

సోషల్ మీడియా నిబంధనల్లో సంస్కరణలు

-జూలై 5న విజయవాడలో సోషల్ మీడియా పై సెమినార్

-సోషల్ మీడియా పై న్యాయ, పోలీస్ వ్యవస్థల్లో సమీక్షలు జరగాలి

-జుగుప్సాకరమైన పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలకు పటిష్టమైన చట్టాలుఉండాలి

-మహిళలపై మహిళలే సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టడం బాధాకరం

-రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు వాసిరెడ్డి పద్మ

అమరావతి, జూన్ 30 జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సోషల్ మీడియా నిబంధనల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మహిళ కమిషన్ అధ్యక్షురాలు వాసిరెడ్డి పద్మ తెలిపారు. శుక్రవారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం నాల్గో బ్లాక్ పబ్లిసిటీ సెల్ లో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మహిళలపై పైశాచికత్వానికి పరాకాష్టగా సోషల్ మీడియాలో పోస్టింగులు ట్రోల్ చేయడం రాతియుగంలో కూడా లేని హీనత్వాన్ని తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులకు చెందిన మహిళలపై అనభ్యకరమైన పదజాలంతో పాటు అశ్లీల చిత్రాలు, అక్రమ సంబంధాల వంటి కట్టు కథల పోస్టింగులు సోషల్ మీడియాలో ట్రోల్ అవ్వడం ఎంతో జుగుప్సాకరమైన విషయం అన్నారు. యు.కె. లో ఉంటున్నటు వంటి ఒక మహిళ రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్నవారి కుటుంబ మహిళలపై సోషల్ మీడియాలో ఎంతో బాధాకరమైన పోస్టులు పెట్టడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. అయితే అటు వంటి వారిని ప్రతి పక్షాల వారు సమర్థించడం అనేది ద్వంద నీతికి నిదర్శనమన్నారు. ఇటు వంటి సందేశాలు ఇవ్వడం ద్వారా వారు సమాజానికి ఎటు వంటి సంకేతాలు ఇస్తున్నారు అనే విషయాన్ని ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చైర్ పెర్సన్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టుకు పోస్టు పెట్టడమే సమాదానం కాదని మరియు ఎంత మాత్రం సమర్థనీయం కూడా కాదని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియా సమాజంలో సృష్టించే దారుణాతి దారుణమైన పరిస్థితులను నియంత్రించడంలో న్యాయ, పోలీస్ వ్యవస్థలు కూడా ఏమీ చేయలేని పరిస్థితులో ఉండటం వల్ల సమస్య మరింత జటిలం అవ్వడానికి దారితీస్తున్నదన్నారు. సోషల్ మీడియా దాడిని యాసిడ్ దాడులు, హత్యా యత్నాలతో సమానంగా చూడాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. వ్యక్తిత్వ హననం హత్య కంటే దారుణంగా మారినప్పుడు చట్టాలకు పదును పెట్టి అదుపుతప్పిన సోషల్ మీడియాను కట్టడి చేయాల్సిన అవసం ఎంతోఉందన్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో సంస్కరణలు తీసుకురావల్సిన అవశ్యకతపై పలువురి సూచనలు,సలహాలను స్వీకరించేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 5 న విజయవాడలో ఒక సెమినార్ ను నిర్వహించనున్నట్లు మహిళా కమిషన్ చైర్ పెర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. సమాజంలోని మేధావులు, సంఘ సంస్కర్తలు, విద్యావంతులు ఈ సెమినార్ లో పాల్గొని సోషల్ మీడియాలో సంస్క రణలు తీసుకువచ్చేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా తమ కార్యాలయానికి మెయిల్ ద్వారా కూడా సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని ఆమె తెలిపారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాదానం చెపుతూ తమ కమిషన్ కు వచ్చిన పిర్యాధులు అన్నింటిపై సత్వరమే చర్యలు తీసుకోనేందుకు పోలీస్ శాఖకు ముఖ్యంగా సైబర్ క్రైం వారికి పంపించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

పార్లమెంటులో బి.సి బిల్లుకై జులై 25న ఛలో ఢిల్లీ

– బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం నిర్ణయం

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రంలో బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని జులై 25న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం నిర్ణయించింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ ల ఆధ్వర్యం లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సబ్యులు ఆర్. కృష్ణయ్యముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో కృష్ణయ్యమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత 75 సంవత్సం ాలుగా బి.సి లకు రాజ్యాంగ బద్దమైన హక్కులు కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఈ అంధోళన కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల నుండి పెద్ద యెత్తున పోల్గొంటారనితెలిపారు. వచ్చే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో బి సి లకు అన్ని రాజకీయ పార్టీలు బి సి లకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. బి.సి లకు అన్యాయం చేసే పార్టీల బరతం పడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సమావేశం లో చేసిన తీర్మానాలను వివరించారు.

సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు ఆమోదించారు :

1) పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో బి.సి లకు 50 శాతం రిజవేషన్లు కల్పించాలి.

2) కేంద్ర ప్రభుత్వనీ త్వరలో చేపట్టబోయే జనాభ గణనలో బి.సి కుల గణన చేపట్టాలి.

3) పంచాయతీరాజ్ సంస్థలో బి.సి రిజర్వేషన్లను 34 శాతం నుండి 52 శాతం కు పెంచాలి. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలి.

4) బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి.

5) కేంద్రంలో బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బి.సి ల స్కీములను రూపొందించాలి. ప్రత్యకంగా కేంద్ర స్థాయి లో స్కాలర్ షిప్ లు, ఫీజుల రియంబర్స్ మెంట్,ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

6) ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి "బి.సి యాక్టు"ను తీసుకరావాలి.

7) బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల పై ఉన్న క్రిమి లేయర్ ను తోలగించాలి.

8) రాష్ట్రంలో కేంద్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బి.సి ల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతం కు పెంచాలి.

9)ప్రపంచీకరణ సరళీకృత ఆర్థిక విధానాలు రావడంతో ప్రైవేటు రంగంలో పెద్దయెత్తున పరిశ్రమలు వచ్చాయి. అందుకే ఎస్సీ/ఎస్టీ/బి.సి లకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలి.

10) సుప్రీమ్ కోర్టు– హై కోర్టు జడ్జీల నియామకాలలో ఎస్సీ/ఎస్టీ/బి.సి లకు రిజర్వేషన్లు పెట్టాలి.

11)కేంద్ర స్థాయిలో బి.సి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలి.

12) కేంద్ర బడ్జెటులో బి.సి లకు 2 లక్షల కోట్లల బడ్జెటు కేటాయించి బి.సి లకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ మరియు ఫీజుల రియంబర్స్ మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలి. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వాలి.

13) జాతీయ బి.సి ఫైనాన్స్ కార్పోరేషన్ రుణాలకు విధించిన షరతులను ఎత్తివేయాలి. బి.సి కార్పొరేషన్ బడ్జెట్ ఏటా 50 వేల కోట్లు కేటాయించి ప్రతి కుటుంబానికి 10 లక్షల నుంచి 50 లక్షల వరకు 80 శాతం సబ్సిడి తో రుణాలు మంజూరు చేయాలి.

14)కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి.

ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, గుజ్జ సత్యం – ఉపాధ్యక్షులు ? జాతీయ బీసీ సంక్షేమ సంఘం, లాల్ కృష్ణ ? కన్వీనర్ ? బీసీ సంక్షేమ సంఘం, నీలనీ వెంకటేష్ – అధ్యక్షులు– రాష్ట్ర బి.సి యువజన సంక్షేమ సంఘం, పిళ్లా శ్రీనివాస్ (నివాస్) ? ప్రధానకార్యదర్శి ? జాతీయ బీసీ యువజన సంఘం, అనంతయ్య – అధ్యక్షులు ?రాష్ట్ర బి.సి ఐక్య వేదిక, సి.రాజేందర్ –అధ్యక్షులు ? తెలంగాణా బి.సి సంఘం, కూనూరు నర్సింహ గౌడ్ –అధ్యక్షులు, రాష్ట్ర బి.సి సంఘర్షణ సమితి, మీడియా కోఆర్డినేటర్ గి.కిరణ్ , జి.కృష్ణ యాదవ్ – అధ్యక్షులు–ూఅ/ూ/అ విద్యార్థి సంఘం , సతీష్, మల్లేష్ యాదవ్, భాస్కర్ ప్రజాపతి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

దిల్లీ విశ్వవిద్యాలయం శత వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 30:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజున ఢిల్లీ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లోని మల్టీ పర్పస్ హాల్ లో దిల్లీ విశ్వవిద్యాలయం శత వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమం జరగగా ఆ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన విశ్వవిద్యాలయం యొక్క నార్త్ కేంపస్ లో ఫేకల్టీ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సెంటర్ ఎండ్ ఎకడమిక్ బ్లాకు భవనం సంబంధి శంకుస్థాపన లో కూడా పాలుపంచుకొన్నారు. ప్రధాన మంత్రి ఇదే సందర్భం లో 'కమెమరేటివ్ సెంటినరీ వాల్యూమ్ – కంపైలేషన్ ఆఫ్ సెంటినరీ సెలిబ్రేషన్స్' ను; 'లోగో బుక్ – లోగో ఆఫ్ ఢిల్లీ యూనివర్సిటీ ఎండ్ ఇట్స్ కాలేజెస్' ను మరియు 'ఆర – 100 ఇయర్స్ ఆఫ్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ' ని ఆవిష్కరించారు.

యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ (డియు) కి చేరుకోవడం కోసం ప్రధాన మంత్రి మెట్రో రైలు లో ప్రయాణించారు; ఈ యాత్ర లో భాగం గా విద్యార్థుల తో ఆయన సంభాషించారు. దిల్లీ యూనివర్సిటీ కి చేరుకొన్న తరువాత ప్రధాన మంత్రి – జర్నీ ఆఫ్ 100 ఇయర్స్ ఎగ్జిబిషన్ గుండా కలియ దిరిగారు. ఫేకల్టీ ఆఫ్ మ్యూజిక్ ఎండ్ ఫైన్ ఆర్ట్స్ సమర్పించిన సరస్వతి వందనాన్ని , 'యూనివర్సిటీ కుల్ గీత్' కార్యక్రమాన్ని ఆయన తిలకించారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, యూనివర్సిటీ ఆఫ్ దిల్లీ (డియు) యొక్క శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం లో పాలుపంచుకోవాలి అని తాను గట్టి గా నిర్ణయించుకొన్నానన్నారు. ఈ అనుభూతి తాను తన సొంత ఇంటి కి వచ్చిన అనుశూతి ని ఇస్తున్నది అంటూ ఆయన అభివర్ణించారు. తన ప్రసంగం కంటే ముందు ప్రదర్శించిన ఒక లఘు చిత్రాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈ విశ్వవిద్యాలయం నుండి ఎదిగిన వ్యక్తులు అందించిన తోడ్పాటు లు ఈ యొక్క విశ్వవిద్యాలయం జీవన చిత్రాన్ని ఆవిష్కరించాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఒక ఉత్సవ సందర్భం లో మహోత్సాహ భావన తో దిల్లీ యూనివర్సిటీ కి విచ్చేసిన ందుకు ప్రధాన మంత్రి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏదైనా ఒక విశ్వవిద్యాలయాన్ని సహచరుల తో కలసి సందర్శించడం తాలూకు ప్రాముఖ్యాన్ని గురించి ప్రధాన మంత్రి నొక్కి పలుకుతూ, ఈ కార్యక్రమాని కి చేరుకోవడం కోసం మెట్రో లో ప్రయాణించే అవకాశం లభించినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

భారతదేశం స్వాతంత్ర్యం అనంతరం 75 సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకొని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను జరుపుకొంటున్న తరుణం లో యూనివర్సిటీ ఆఫ్ దిల్లీ శత వార్షికోత్సవాలు అవతున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. "విశ్వవిద్యాలయాలు మరియు విద్య సంస్థ లు ఆ దేశం కార్యసిద్ధుల కు అద్దం పడతాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. డియు 100 సంవత్సరాల ప్రస్థానం లో, ఎంతో మంది విద్యార్థులు, గురువులు తదితరుల జీవనం తో సంబంధం కలిగినటువంటి అనేకమైన చరిత్రాత్మక ఘట్టాలు చోటు చేసుకొన్నాయి అని ఆయన అన్నారు. దిల్లీ విశ్వవిద్యాలయం ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదు అది ఒక ఉద్యమం, అది ప్రతి ఒక్క ఫుడియ ను జీవం తో నింపి వేసింది అని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం తో అనుబంధం కలిగినటువంటి ప్రతి ఒక్క విద్యార్థి కి, ప్రతి ఒక్క గురువు కు మరియు తదితరుల కు శత వార్షికోత్సవాల సందర్భం లో ప్రధాన మంత్రి అభినందనల ను వ్యక్తం చేశారు.

సభికుల లో క్రొత్త విద్యార్థుల తో పాటు పూర్వ విద్యార్థులు కూడా ఉండడాన్ని గమనించిన ప్రధాన మంత్రి, ఇది పరిచయాల ను పెంచుకొనేందుకు ఒక అవకాశం అన్నారు. "ఈ వంద సంవత్సరాల కాలం లో డియు తన ఉద్వేగాల ను సజీవం గా అట్టిపెటుకొన్నది, అది తన చైతన్యభరితమైన విలువల ను కాపాడుకొంది కూడాను" అని ప్రధాన మంత్రి అన్నారు. జ్ఞానం ప్రాముఖ్యాన్ని గురించి ప్రధాన మంత్రి నొక్కి చెప్తూ, నాలందా మరియు తక్షశిల వంటి చైతన్యభరిత విశ్వవిద్యాలయాలు భారతదేశం లో అలరారిన కాలం లో భారతదేశం సమృద్ధి పరంగా శిఖర స్థాయి లో ఉండింది అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. "భారతదేశం యొక్క సమృద్ధి కి వాహకం గా భారతదేశం యొక్క ఘనమైన విద్య బోధన వ్యవస్థ ఉండింది" అని ఆయన అభివర్ణించారు. ఆ కాలం లో ప్రపంచ జిడిపి లో భారతదేశాని కి అధిక వాటా ఉన్న సంగతి ని ఆయన గుర్తు కు తీసుకు వచ్చారు. బానిసత్వం కాలం లో జరిగిన నిరంతరాయ దాడులు ఈ సంస్థల ను దెబ్బతీశాయి; దానితో భారతదేశం లోకి తరలివస్తున్న మేధావుల మార్గం లో అంతరాయం ఏర్పడి, మరి వృద్ధి స్తంభించిపోయింది అని ఆయన అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చాక స్వేచ్ఛా భారత భావోద్వేగ తీవ్రతకు నిర్దిష్ట రూపకల్పనలో భాగంగా విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాయని ఆయన చెప్పారు. ఈ మేరకు ప్రతిభగల బలమైన యువతరం సృష్టిలో ఢిల్లీ విశ్వవిద్యాలయం కూడా ప్రధాన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ విధంగా గతంపై అవగాహన మన మనుగడకు ఒక రూపమిచ్చి, ఆదర్శాలకు తీర్చిదిద్ది, భవిష్యత్ దృక్కోణాన్ని విశాలం చేస్తుందన్నారు. అలాగే "ఒక వ్యక్తి లేదా సంస్థ సంకల్ప లక్ష్యం దేశమే అయినపుడు, అది సాధించే విజయాలన్నీ జాతి సాధించే విజయాలతో సమానమే'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఢిల్లీ విశ్వవిద్యాయం ఏర్పడ్డాక తొలినాళ్లలో కేవలం 3 కళాశాలలు మాత్రమే దాని పరిధిలో ఉండేవని శ్రీ మోదీ గుర్తుచేస్తూ, ఇవాళ 90కిపైగా కాలేజీలు ఉన్నాయని వెల్లడించారు. ఒకనాడు దుర్బల ఆర్థిక వ్యవస్థగా పరిగణించబడిన భారత్, నేడు ప్రపంచంలో 5వ అతిపెద్ద వ్యవస్థగా ఆవిర్భవించిందని స్పష్టం చేశారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదివే మహిళల సంఖ్య పురుషులకన్నా అధికమని ప్రధాని పేర్కొన్నారు. దీన్నిబట్టి దేశంలో లింగ నిష్పత్తి గణనీయంగా మెరుగుపడినట్లు తెలుసుకోవచ్చునని చెప్పారు. ఒక దేశం–విశ్వవిద్యాలయ సంకల్పాల నడుమ అవినాభావ సంబంధానికిగల ప్రాధాన్యాన్ని ఆయన విశదీకరించారు. ఉన్నత విద్యా సంస్థల మూలాలు ఎంత లోతుగా ఉంటే, దేశం పురోగమనం అంత ఉన్నతంగా ఉంటుందని చెప్పారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రారంభమైనపుడు దాని లక్ష్యం భారత స్వాతంత్ర్య సాధనేనని ప్రధాని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మనం స్వాతంత్ర శతాబ్ది వేడుకలు నిర్వహించుకునే నాటికి ఈ సంస్థకు 125 ఏళ్లు పూర్తవుతాయని చెప్పారు. ఈ అమృత కాలంలో 'వికసిత భారతం' నిర్మాణంపై ఈ సంస్థ సంకల్పంపూనాలని ఉద్బోధించారు. "గత శతాబ్దపు మూడో దశాబ్దంలో భారత స్వాతంత్ర్య పోరాటం కొత్త వేగం పుంజుకుంది. ఈ కొత్త శతాబ్దంలో మూడో దశాబ్దం భారత ప్రగతి పయనానికి ప్రేరణనిస్తుంది" అని ప్రధానమంత్రి చెప్పారు. రాబోయే కాలంలో మరిన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ పెద్ద సంఖ్యలో ఏర్పాటు కాగలవని ప్రధానమంత్రి చెప్పారు. ''ఈ సంస్థలన్నీ నవ భారత నిర్మాణంలో ఇటుకలుగా మారగలవు" అని ఆయన చెప్పారు.

విద్య అంటే కేవలం బోధన ప్రక్రియ ఒక్కటే కాదని, అభ్యసన మార్గమని ప్రధాని నొక్కిచెప్పారు. అభ్యసనాంశాలపై విద్యార్థుల దృక్కోణంలో చాలాకాలం తర్వాత మార్పు కనిపిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. తదనుగుణంగా తమకు కావాల్సిన పాఠ్యాంశాలను ఎంచుకునే స్వేచ్ఛ నేడు కొత్త జాతీయ విద్యా విధానం ద్వారా అందుబాటులోకి వచ్చిందన్నారు. విద్యా సంస్థల మధ్య పోటీతత్వం, బోధన నాణ్యత మెరుగుదలను ప్రస్తావిస్తూ– జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ చట్రం గురించి ప్రధానమంత్రి వివరించారు. ఈ చట్రం సంస్థలను ప్రేరేపిస్తుందని, వాటి స్వయంప్రతిపత్తిని విద్యా నాణ్యతతో అనుసంధానించేలా కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

భవిష్యత్ దృక్పథంగల విద్యా విధానాలు, నిర్ణయాల నేపథ్యంలో భారతీయ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు పెరుగుతోందని ప్రధాని అన్నారు. ఈ మేరకు 2014 నాటి 'క్యూఎస్' ప్రపంచ ర్యాంకింగ్‌లో దేశంలోని 12 విశ్వవిద్యాలయాలకు మాత్రమే చోటు లభించిందని ఆయన గుర్తుచేశారు. అయితే, నేడు ఈ సంఖ్య 45కి చేరిందని, ఈ పరివర్తనకు చోదకశక్తిగా నిలిచిన ఘనత భారత యువతరానిదేనని ప్రధాని ప్రశంసించారు. విద్య అనేది కేవలం డిగ్రీ సాధన, ఉద్యోగ సముపార్జనకే పరిమితమనే భావనను నేటి యువతరం తుత్తునియలు చేసిందని ప్రధాని ప్రశంసించారు. వారు తమదైన భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ వెళ్తున్నారని, అందుకే దేశంలో అంకుర సంస్థల సంఖ్య లక్షకుపైగా నమోదైందని పేర్కొన్నారు. అలాగే 2014–15తో పోలిస్తే ఇవాళ పేటెంట్ దరఖాస్తుల సమర్పణ, ప్రపంచ ఆవ

డిజిపికి స్వాగతం పలికిన పోలీస్ కమిషనర్

కరీంనగర్, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు పర్యటనకు హాజరయ్యేందుకు వెళ్తున్న రాష్ట్ర డిజిపి అంజని కుమార్ శుక్రవారం నాడు మార్గం మధ్యలో కరీంనగర్ కు వచ్చారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కేంద్రంలో డిజిపి గౌరవ వందనం స్వీకరించారు.

పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి లు తుల శ్రీనివాసరావు, బి విజయకుమార్, సి ప్రతాప్ ఆర్ఐ ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు

తానా మహాసభలకు డాక్టర్ వకుళాభరణంకు ఆహ్వానం

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):అమెరికా లోని ఫిలడెల్ఫియాలో జులై 7, 8, 9 తేదీలలో నిర్వహిస్తున్న తానా మహా సభలకు రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు కు ఆహ్వానం అందింది. ఈ సభలలో జరిగే ప్రధాన కార్యక్రమాల్లో డాక్టర్ వకుళాభరణం ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు. కరోనా పరిణామాల అనంతరం ఈ సారి ప్రత్యక్షంగా జరుగబోయే ఈ మహా సభలను తానా ఘనంగా నిర్వహించనున్నది.

కాగా అమెరికాలో నిర్వహించే తానా సభలలో కూడా డాక్టర్ కృష్ణమోహన్ ను ప్రత్యేకంగా సన్మానించనున్నారు.

ఈ అమెరికా వర్యటనలో భాగంగా హూస్టన్, డల్లాస్, న్యూయార్క్, న్యూజెర్సీ, చార్లేట్ మున్నగు ప్రాంతాలలో జరిగే ప్రత్యేక ఆత్మీయ సమ్మేళనాలు, అభినందన సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

జూలై 2 న, ఉదయం 4 గంటలకు బయలుదేరి వెళ్లనున్న డాక్టర్ వకుళాభరణం జూలై 24 వ తేది వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మూడు వారాల పాటు అమెరికా లో పర్యటించడానికి డాక్టర్ వకుళాభరణం కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి 1న రవీంద్ర భారతిలో "తానా" నిర్వహించిన బహుజన ఉత్సవాలలో డాక్టర్ కృష్ణ మోహన్ కు "బహుజన బంధు పురస్కారం" ను అందజేసిన విషయం తెలిసిందే.

పోడు రైతులు ఇక హక్కుదారులు..ధైర్యంగా సాగు చేసుకోవాలి : స్పీకర్ పోచారం

కామారెడ్డి, జూన్ 30: (నేటినిజం ప్రతినిధి): దశాబ్దాల తరబడి ఉన్న పోడు భూముల సమస్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపారని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పోడు రైతులు ఇక హక్కుదారులని, ధైర్యంగా భూముల సుసాగు చేసుకోవాలని సూచించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో పోడు భూములకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతికి సంతాపం తెలుపుతూ సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. పోడు పట్టాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

స్పీకర్ మాట్లాడుతూ పోడు పట్టాలు కఠినమైన సమస్య అని పేర్కొన్నారు. గతంలో వానాకాలం వచ్చిందంటే భూమి దున్నడానికి వెళ్లే రైతులు, అటవీశాఖ సిబ్బంది మధ్య ప్రతినిత్యం గొడవలు జరిగేవని గుర్తు చేశారు. 2005 కంటే ముందు అటవీ భూములలో సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు అందజేయాలని కేంద్ర చట్టంలో ఉన్నదని వెల్లడించారు.

బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో 2100 మంది బంజారాలకు సుమారు 4000 ఎకరాల పోడు పట్టాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులు ఉంటే సర్వే చేయించి పట్టాలు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల మంది గిరిజన రైతులకు మొత్తం నాలుగు లక్షల ఐదు వేల ఎకరాలకు పట్టాలను ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఎటువంటి పైరవీలు, సిఫారసులు లేకుండా అర్హులైన బంజారా లకు పట్టాలు అందుతున్నాయని వెల్లడించారు. ఈ భూములకు కూడా రైతుబంధు వస్తుందన్నారు.

పర్యావరణం బాగుండి, వర్షాలు మంచిగా కురవాలంటే వృక్షాలు ఉండాలి. ఇకనుంచి కొత్తగా చెట్లు నరకకుండా అడవులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, బాన్సువాడ, బోధన్ ఆర్డీవోలు రాజాగౌడ్, రాజేశ్వర్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు డి అంజిరెడ్డి, బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షిరిడి నుండి శివంకు..

హైదరాబాద్, జూన్ 30:నల్లకుంట డివిజన్ శివం రోడ్డు లోని శ్రీ పుట్టపర్తి సాయిబాబా వారి చే ప్రారంభించబడిన శివం ఆలయంలో గురువారం సాయంత్రం షిరిడి సాయి నాధుని భక్తురాలు లక్ష్మీబాయి షిండే కు అందజేసిన తొమ్మిది నాణెములకు ప్రత్యేక పూజ కార్యక్రమం సందర్భంగా నేడు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్వర రావు గారు వారి బృందం లక్ష్మీబాయి షిండే ముని మనవడు అరున్ గైక్వాడ్ షిండేకు స్వాగతం పలికారు భక్తితో భజనల తో.అనంతరం శివం ప్రాంగణంలోని ఆలయం లోకి తీసుకెళ్లి ప్రత్యేక దర్శనం చేయించి అనంతరం భక్తుల మధ్య ఏర్పాటు చేసి భక్తులకు ఒక్కొక్కరిగా నాణెములను తాకుతూ దర్శనం కలిగించారు ప్రత్యేకంగా తర్వాత భజ నలు గీతా లను ఆలపించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై తొమ్మిది నాణేలకు పూజలను చేశారు . ఈ కార్యక్రమంలో హైదరా బాద్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్వర రావు హెచ్ జ దొర రిటైర్డ్ ఐపిఎస్ శేష సాయి ట్రస్ట్ సెక్రటరీ రాజేందర్ సాయిబాబా ఎమ్ ఎల్ న్ స్వామి కే లక్ష్మీనరసింహ తదితరులు హాజరయ్యారు.

దక్షిణ కొరియాలో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి అధ్యయన బృందం..

న్యూఢిల్లీ, జూన్ 30: వేమానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి లో భాగంగా తీదక్షిణ కొరియా వెళ్లిన తెలంగాణ బృందానికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సింగపూర్, సీయోల్, ఒసో లో అధ్యయనం చేసేందుకు గురువారం వెళ్లగా శుక్రవారం దక్షిణ కొరియా చేరుకుంది. బృందంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్తోపాటు కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్, పర్యాటకశా ఖ ఎండీ లు ఉన్నారు.

మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి లో భాగంగా తీదక్షిణ కొరియా వెళ్లిన తెలంగాణ మంత్రులు మరియు అధికారులకు బృందానికి విమానాశ్రయంలో విదేశీ వ్యవహారాల ఇంచార్జి స్వాగతం పలికారు. సింగపూర్‌తోపా టు సౌత్ కొరియాలోని సియోల్, ఓసోలో పర్యటించనున్నన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు లో చేపడుతున్న బిగ్ ఓ ఫౌంటెయిన్ ఒసోలోనే ఉంది, అక్కడ ఉన్న దానికంటే ఇక్కడ ఆధునిక టెక్నాలజీని తీసుకువచ్చేందుకు ప్రయత్నా లు చేసేందుకు ఈ బృందం స్టడీ టూర్ కు వెళ్ళింది.

ఒసో రివర్ ఫ్రంట్‌లోని ఎలిమెంట్లను కరీంనగర్ తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు మంత్రి గంగుల. సింగపూర్‌లో అమెరికన్ టెక్నాలజీతో నిర్మించిన యూనివర్సల్ స్టూడియోని అధ్యయ నం చేస్తామన్నారు. గుజరాత్‌లోని సబర్మతీ రి వర్ ఫ్రంట్ కంటే అధునాత నంగా, మన రాష్ట్రానికే గర్వకారణంగా మానేరు రివర్ ఫ్రంట్‌ను నిర్మిస్తామని స్పష్టం చేశారు.

అనుపురంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి-ప్రత్యేక అధికారి ఆకుల శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంలో సచ్ సర్వేక్షన్ లో భాగంగా ప్రత్యేక అధికారి ఆకుల శ్రీనివాస్ పారిశుధ్య నిర్వహణను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్వాడీలు, మురికి కాలువ నిర్వహణ, చెత్తనిర్వహణ, డ్రైడే, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్వహణ ఏవిధంగా ఉన్నదో పరిశీలించారు.గ్రామపంచాయతీ నిర్వహించే వివిధ రికార్డులను పరిశీలించడంతో పాటు గ్రామ కార్యదర్శికి పారిశుద్ధ్య నిర్వహణకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, గ్రామ కార్యదర్శి శ్రీవాణి ఆయనతో ఉన్నారు.

ఎంపీడీవో జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల ఎంపీడీఓ జన్మదిన వేడుకలను మండల పరిషత్ కార్యలయంలో సర్పంచ్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపిడివోనుశాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దీవెనలు ఎంపీడీవోపై ఉండి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు కదిరె రాజు, రాంరెడ్డి, లక్ష్మరెడ్డి, రాజేష్, బిఆర్ఎస్ నాయకులు బాబు, ఇటిక్యాల రాజు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటాలి...!-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి జూన్ 30 (నేటి నిజం ప్రతినిధి)శుక్రవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో జిల్లా స్థాయి అధికారులు, మండల పరిషత్ అధికారుల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు పడ్డ గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో, ప్రభుత్వ భూముల్లో,స్కూల్స్, కళాశాలల్లో మొక్కలు నాటాలని అన్నారు. యూకలిప్టస్,గానుగ మొక్కల వంటి వాటికీ ప్రాధాన్యత ఇవ్వాలి.కొత్త ప్రాంతాలను గుర్తించి హరితహారం టార్గెట్ పూర్తి చేయాలి.జిల్లాలో సొంత గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు లేని గ్రామాల వివరాలు అందజేయాలన్నారు.గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ఆరోగ్యకరమైన గొర్రెలను లబ్ధిదారులకు అందజేయాలని, వాల్యుయేషన్, ఫిట్నెస్ సర్టిఫికేట్ డిపార్ట్మెంట్ సరి చూసి లబ్ధిదారులకు జారీ చేయాలి. జిల్లాలో వెనుకబడిన వర్గాల్లో కులవృత్తులకు,చేతి వృత్తి దారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయానికి వచ్చిన దరఖాస్తుల్లో పారదర్శకత పాటించి, ఎంపిక చేయాలని అన్నారు. అభ్యర్థుల వయసు 18 సంవత్సరాలు నుండి 55 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు.

కుటుంబ వార్షికాదాయం గ్రామాలకు లక్షన్నర, పట్టణాలకు రెండు లక్షలు తప్పనిసరిగా ఆదా యాత్ర ధ్రువ పత్రం కలిగి ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్ఓ నగేష్, డిపిఓ సురేష్ మోహన్, పిడి డిఆర్డిఏ శ్రీనివాస్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారినిశ్రీ వసంతకుమారి, సివిల్ సప్లై అధికారిని వనజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ మండల ఎంపీడీఓ లు ,తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): బోయినపల్లి మండలంలోని మధ్య మానేరు జలాశయంలో శుక్రవారం ముగ్గురు పిల్లలతో సహా తల్లి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీయించారు. మృతురాలు వేములవాడ మండలం రుద్రారం గ్రామానికి చెందిన రజిత గా గుర్తించారు. రజిత కరీంనగర్ కు చెందిన మహమ్మద్ అలీని ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం పెద్ద పాప అసరాజా బిన్ (5), మహమ్మద్ అయాన్ (7), ఉస్మాన్ అహ్మద్ (14 నెలలు) ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హైదరాబాద్‌లో తమ మొట్టమొదటి కెరీర్ డిస్కవరీ డే నిర్వహించిన వరల్డ్ వైడ్ టెక్నాలజీ ఇండియా



హైదరాబాద్, జూన్ 30: గ్లోబల్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన వరల్డ్ వైడ్ టెక్నాలజీ, ఈరోజు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశంలో మొట్టమొదటి సారిగా కెరీర్ డిస్కవరీ డేని నిర్వహించింది. హైస్కూల్ విద్యార్థులు వివిధ కెరీర్ ఎంపికలను అన్వేషించడానికి, వివిధ రంగాలలోని నిపుణుల నుండి సూచనలను పొందేందుకు మరియు నేడు అందుబాటులో ఉన్న అనేక అవకాశాల మధ్య వారి భవిష్యత్తు గురించి తగిన సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది. భారతదేశంలో డబ్ల్యుడబ్ల్యుటి యొక్క కమ్యూనిటీ కార్యక్రమాలకు విద్యకు తగిన అవకాశాలు ఒక ప్రధాన సిద్ధాంతం. కెరీర్ డిస్కవరీ డే వంటి కార్యక్రమాలు విద్యార్థులకు వారి ఆసక్తులు మరియు బలాలపై లోతైన అవగాహన ఆధారంగా భవిష్యత్ కెరీర్ మార్గాల గురించి సమాచారం తీసుకునేలా చేస్తుంది. రోజంతా, విద్యార్థులకు ఫస్ట్-హ్యాండ్ ప్రాక్టికల్ అనుభవాన్ని పొందడానికి, అపోహలను సవాలు చేయడానికి మరియు విభిన్న పరిశ్రమల నుండి నిపుణులతో అర్థవంతమైన చర్చలను చేయటానికి, వివిధ కెరీర్‌లు మరియు పని వాతావరణాలపై పరిజ్ఞానం పొందేందుకు వీలు కల్పించారు. ఈ సందర్భంగా వరల్డ్ వైడ్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ - గ్లోబల్ హ్యూమన్ రిసోర్సెస్, ఆన్ మార్ మాట్లాడుతూ, "వరల్డ్ వైడ్ టెక్నాలజీ ఎల్లప్పుడూ వ్యక్తులను కీలకమైన ఆస్తిగా పరిగణిస్తుంది మరియు మా ఈ అభిప్రాయం సంస్థను దాటి మా స్థానిక కమ్యూనిటీలకు కూడా విస్తరించింది. హైదరాబాద్ మరియు దేశంలోని ఇతర ప్రాంతాలలో మా కమ్యూనిటీ-ఇంపాక్ట్ ప్రోగ్రామ్‌ల గురించి మేము చాలా గర్వపడుతున్నాము, ఇవి 3,000 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయని మరియు వారు విజయవంతం కావడానికి అవసరమైన సాధనాలతో వారిని సన్నద్ధం చేయాలని భావిస్తున్నారు. సమానత్వం కోసం అత్యంత శక్తివంతమైన మార్గం విద్య మరియు విద్యార్థులకు ఈ వనరులను అందించడం వలన వారు కోరుకున్న భవిష్యత్తును సృష్టించుకోవచ్చు..." అని అన్నారు.

అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలి-ఐద్వా జిల్లా కార్యదర్శి జ్వాజి విమల

రాజన్న సిరిసిల్ల, జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జ్వాజి విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూవేములవాడ పట్టణంలో ఇళ్లులేని వాళ్ళందరికీ వెంటనే ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి మూడు లక్షలు అందించాలని డిమాండ్ చేస్తూ జులై 3న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ధర్నాకు నిరుపేదలందరు తరలి రావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, టిఆర్ఎస్ పార్టీ రెండోసారి అధికారం అనుభవించి, పాలన పూర్తి కావస్తున్న కూడా పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇస్తానన్న హామీ పూర్తి చేయకపోవడం చూస్తుంటే పేదల పట్ల టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉన్నదో అర్థమవుతుందన్నారు. పది సంవత్సరాల నుండి ఇల్లు ఇవ్వకపోతే ఇంకెప్పుడు ఇస్తారని అన్నారు.

పేదవాడు ఇంటికొరకు ఎన్ని సంవత్సరాలు ఎదురు చూడాలో ఎమ్మెల్యే రమేష్ బాబు తెలుపాలి అన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ కచ్చితంగా డబల్ బెడ్ రూమ్ అందిస్తామని చెప్పి ఇప్పటివరకు వేములవాడ లో ఎవ్వరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇల్లు లేని నిరుపేదలందరికీ వెంటనే ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి మూడు లక్షల రూపాయలు అందించాలని,ఇంటి స్థలాలు ఇచ్చేదాకా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మనీషా, జ్యోతి, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానము
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
డా॥ ఓలేటి పార్వతీశం గారికి
జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥ రావూరి భరద్వాజ
స్మారక సాహితీ పురస్కారం మరియు
శ్రీమతి పరిమళా సోమేశ్వర్ గారికి శ్రీమతి రావూరి కాంతమ్మ
స్మారక సాహితీ సేవా పురస్కార ప్రదానం
పురస్కార స్వీకర్తలు
డా॥ ఓలేటి పార్వతీశం
సాహిత్యం
శ్రీమతి పరిమళా సోమేశ్వర్
సాహిత్యం
ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్.(ర), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ అలపర్తి రామకృష్ణ, కథ, నవలా రచయిత
సభాప్రారంభం : శ్రీ శ్రీధర, కథ, నవలా రచయిత
ఆత్మీయ అతిథి : శ్రీ బొప్పన నరసింహా రావు, అధ్యక్షులు, కళా వినంచి
అతిథి సత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వర రావు
డా॥ రావూరి భరద్వాజ & శ్రీమతి రావూరి కాంతమ్మ ట్రస్ట్
సాంస్కృతిక కార్యక్రమం : సంగీత విభావరి
గానం : శ్రీ శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమి
డైరెక్టర్, సంగీత గురువు శ్రీమతి చిల్లాశివపార్వతి
తేది: 05-07-2023, బుధవారం, ఉ॥ 10:00 గంటలకు
డా॥ కె.వి. రమణ క్యాంపు కార్యాలయం, నఫీజ్ రెసిడెన్సీ ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్.
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
గుబిలిండి వెంకటరెడ్డి, చైర్మన్
వి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి
డా॥ రావూరి భరద్వాజ & శ్రీమతి కాంతమ్మ ట్రస్ట్
రావూరి వెంకట కోటేశ్వరరావు
రావూరి సాయి సుమంత్

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.